Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 305 మేడ్చల్ మల్కాజ్‌గిరి 23 నవంబర్ 2023 గురువారం పేజీలు : 4

## శవాల దిబ్బగా గాజా ఆస్పత్రి!

గాజాలోని రెండో అతిపెద్ద దవాఖానాగా పేరున్న ఇండోనేషియా ఆస్పత్రి శవాల దిబ్బగా మారిందని పలువురు రోగులు వివరించారు. ఆస్పత్రిలో 600 మంది రోగులు చికిత్స పొందుతుండగా.. వారిలో 200 మందిని ప్రత్యేక బస్సుల్లో ఖాన్‌యూనిసకు తరలించారు. అక్కడ వారు అంత ర్జాతీయ మీడియాతో మాట్లాడారు. "కరెంటు లేక.. జనరేటర్లు పనిచేయక చాలా మంది రోగులు చనిపోయారు. ఆస్పత్రిలోని ప్రతి విభాగంలో మృతదేహాలున్నాయి. ఆహారం, ఔషధాల కొరత కూడా వారి మరణాలకు కారణం. ఇజ్రాయెల్ జరిపిన షెల్లింగ్‌లో ఓ విభాగం కుప్పకూలింది. శిథిలాల కింద చాలా మంది రోగులున్నారు" అని వివరించారు. జబాలి యాలోని ఐరాస శరణార్థి శిబిరం వద్ద హమాస-ఇజ్రాయెల్ దళాల మధ్య భీకర పోరు సాగుతోంది. ఇక్కడ 17 మంది చనిపోయారు. ఉత్తర గాజాలో ఇజ్రాయెల్ షెల్లింగ్‌లో 9 ఇళ్లు ధ్వంసమయ్యాయని, ఆ ఇళ్లలోని వారంతా చనిపోయి ఉంటారని గాజా ఆరోగ్యశాఖ తెలిపింది.

# కోలాహలంగా తెలంగాణ

## ప్రచారానికి చివరి వారం

## జాతీయ నేతలంతా ఇక్కడే!




హైదరాబాద్ : పోలింగ్ తేదీ దగ్గరపడుతుండటంతో దాదాపుగా మరో వారం రోజులే ప్రచారానికి సమయం ఉంది! దీంతో ప్రచారం విషయంలో చివరి వారం చితక్కొట్టేయడమే అని భావిస్తున్నాయంట ప్రధాన పార్టీలన్నీ! ఈ నేపథ్యంలో జాతీయ స్థాయి నేతలంతా ఈ నెల 23 తర్వాత తెలంగాణలోనే తిష్టవేయనున్నారని తెలుస్తుంది. ఈ నెల 23తో ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారం ముగియనుండటంతో ఇక తనువు, మనసు మొత్తం తెలంగాణలోనే అని అంటున్నారు.

అవును... ఎన్నికల ప్రచారం చివరిదశకు వస్తుండటంతో వారం రోజు లపాటు అగ్రనేతల ప్రచారంతో తెలంగాణ రాష్ట్రం హెూరెత్తనుందని తెలుస్తుంది. ఇందులో భాగంగా... బీజేపీ నుంచి నరేంద్రమోడీ, అమిత్ షా, జె.పి.నడ్డా... కాంగ్రెస్ నుంచి రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, మల్లికార్జునఖర్గే... బీఆరెస్స్ నుంచి కేసీఆర్... జనసేన తరుపున పవన్ కల్యాణ్... సీపీఎం నుంచి సీతారాం ఏచూరి, బృందాకారాత్ సహా పలువురు ముఖ్యనేతతో ప్రచారానికి పార్టీలు ఏర్పాట్లు చేసుకున్నాయని సమాచారం.

**24నుంచి తెలంగాణలోనే రాహుల్, ప్రియాంక: :** తెలంగాణలో అధికార బీఆరెస్స్ కు తామే ప్రత్యామ్నాయం అని.. ఈసారి ఎట్టిపరిస్థితుల్లోనూ గెలిచి తీరుతామని చెబుతున్న కాంగ్రెస్ నేతలు ప్రచారంలో పట్టుసడలకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఆ పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఈ నెల 24 నుంచి 28 వరకు సుమారు ఇరవైకి పైగా సభల్లో పాల్గొనేలా ప్లాన్ చేశారని తెలుస్తుంది. ఇందులో భాగంగా 24, 25, 27 తేదీల్లో ప్రియాంక గాంధీ సుమారు పది నియోజకవర్గాల్లో పర్యటించేలా పార్టీ ప్లాన్ సిద్ధం చేసింది. ఈ క్రమంలో... 24న పాలకుర్తి, హుస్నాబాద్, ధర్మపురి... 25న పాలేరు, వైరా, ఖమ్మం, మధిర... 27న మునుగోడు, గద్వాల, దేవరకొండ నియోజకవర్గాల్లో జరిగే ప్రచార సభల్లో ఆమె ప్రసంగిస్తారు. ఇలా మూడు రోజుల్లో 10 బహిరంగ సభల్లో ఆమె పర్యటించనున్నారు! మరోపక్క 24 నుంచి రాహుల్ గాంధీ రాష్ట్రంలోనే ఉండనున్నారు. ఇందులో భాగంగా... కామారెడ్డిలో 26న భారీ బహిరంగ సభలో పాల్గొంటారు. ఈ మూడు రోజుల్లో వీలైనన్ని భారీ బహిరంగ సభలతోపాటు ర్యాలీల్లో పాల్గొనాలని ప్లాన్ చేస్తున్నారు! 28వ తేదీన ప్రచారం ముగిసే వరకూ రాహుల్ రాష్ట్రంలోనే ఉండబోతున్నారని అంటున్నారు.

**మోడీ మూడు రోజుల షెడ్యూల్ ఫిక్స్!: :** కర్ణాటక ఎన్నికల్లో తగిలిన దెబ్బకు తెలంగాణ ఎన్నికలే ఆయింట్ మెంట్ అని బీజేపీ అగ్రనాయకత్వం బలంగా నమ్ముతుందని తెలుస్తుంది. దీంతో ఈసారి తెలంగాణ ఎన్నికల్లో ఎలాగైనా సత్తాచాటాలని బలంగా భావిస్తుంది! ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ 25, 26, 27 తేదీల్లో మూడు రోజులపాటు తెలంగాణలో పూర్తి స్థాయిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. ఇందులో భాగంగా... 25న కామారెడ్డి, మహేశ్వరం.. 26న తూప్రాన్, నిర్మల్.. 27న మహబూబాబాద్, కరీంనగర్ నియోజకవర్గాల్లో జరిగే భారీ బహిరంగ సభలలో పాల్గొని ప్రధాని మోడీ ప్రసంగించనున్నారు. ఇదే క్రమంలో 27న రెండు బహిరంగ సభలతో పాటు హైదరాబాద్ రోడ్ షోలో పాల్గొని తన ఎన్నికల ప్రచారాన్ని ముగిస్తారు! ఇదే సమయంలో కేంద్ర హెూంమంత్రి అమిత్ షా ప్రచారం 24, 26, 28 తేదీల్లో ఉంటుందని అంటున్నారు. అదేవిధంగా... బీజేపీ జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డా సైతం మూడు రోజులు వివిధ నియోజకవర్గాల్లో నిర్వహించే సభలలో పాల్గొంటారని... వీరితోపాటు వీలైతే బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు యోగి ఆదిత్యనాథ్, హిమంత్ బిశ్వశర్మ, ప్రమోద్ సావంత్ కూడా రాష్ట్రానికి వస్తున్నారని సమాచారం!

**సీపీఎం జాతీయ నేతల షెడ్యూల్ ఇదే!:** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ప్రచారానికి గడువు దగ్గరపడుతుండటంతో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్ బ్యూరో సభ్యులు బృందా కారాత్, సుభాషిణి అలీ, విజయరాఘవన్ ఇతర ముఖ్యనేతలు ఈ నెల 25, 26, 27 తేదీల్లో ఉమ్మడి నల్గొండ, ఖమ్మం జిల్లాలతో పాటు హైదరాబాద్ సభల్లో పాల్గొంటారని తెలుస్తుంది.

**చివరి నిమిషం వరకూ మోతమోగించనున్న సీఎం!:** గతకొన్ని రోజులుగా తెలంగాణలో సరాసరిన రోజుకి రెండు నుంచి మూడు సభల్లో పాల్గొంటూ, పలు నియోజకవర్గాలను కవర్ చేస్తూ తనదైన శైలిలో ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న సీఎం కేసీఆర్... ఎన్నికల ప్రచార సమయం పూర్తయ్యేవరకూ ఆ పనిలోనే ఉండబోతున్నారని తెలుస్తుంది. ఇందులో భాగంగా... 28న వరంగల్, గజ్వేల్ బహిరంగసభల్లో పాల్గొని ఎన్నికల ప్రచారాన్ని ముగించనున్నారు.

**ఐదు నియోజకవర్గాల్లో పవన్ కల్యాణ్ ప్రచారం!:** అనూహ్యరీతిలో అన్నట్లుగా తెలంగాణ ఎన్నికల్లో బీజేపీతోకలిసి పోటీ చేస్తుంది జనసేన! ఈ క్రమంలో అటు జనసేన, ఇటు బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వారాహి యాత్ర చేపట్టకపోయినా.. సభల్లో ప్రసంగిస్తారని తెలుస్తుంది! ఇందులో భాగంగా... వరంగల్ వెస్ట్, సూర్యాపేట, కొత్తగూడెం, దుబ్బాక, తాండూరు నియోజకవర్గాల్లోని సభల్లో పాల్గొని ప్రసంగిస్తారు!




తాండూరు: ధరణి తీసేస్తే మళ్లీ దళారి రాజ్యం వస్తుందని సీఎం కేసీఆర్ అన్నారు. కాంగ్రెస్ భూమాతను ప్రవేశపెడతామని చెబుతోందని.. అది భూ'మేతే' అవుతుందని ఎద్దేవా చేశారు. తాండూరులో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన పైలట్ రోహిత్‌రెడ్డి తరపున ఎన్నికల ప్రచారం చేశారు. "రూ.200 ఉన్న పింఛను రూ.2వేలు చేశాం. రైతుల బాగోగుల కోసం రైతుబంధు ప్రవేశపెట్టాం. మరోసారి అధికారంలోకి వస్తే రూ.16వేలు రైతుబంధు ఇస్తాం. ధరణి తీసేస్తే రైతుబంధు, రైతు బీమా డబ్బులు ఎలా వస్తాయి. తెలంగాణ రాష్ట్రంలో 24 గంటల కరెంటు వస్తోంది. పొరుగున ఉన్న కర్ణాటకలో ఐదు గంటలే కరెంటు ఇస్తున్నారు. కరవు, వలసలతో గత కాంగ్రెస్ హయాంలో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. అలాంటి పరిస్థితులు నేడు తెలంగాణలో లేవు. నీటిపన్ను రద్దు చేశాం. రైతుబంధు సొమ్ము దుబారా అని మాజీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మూడు గంటల కరెంటు సరిపోతుందని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అంటున్నారు. అలాంటి కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మి ఓటు వేసి ఆగం కావొద్దు. భాజపా నాయకులు వచ్చి మన ఎమ్మెల్యేలను కొనుగోలు చేయాలని వస్తే పైలట్ రోహిత్‌రెడ్డి పట్టించారు. అందుకే ఆయన ఏ పనులు అడిగినా వెంటనే నిధులు మంజూరు చేశాను. 3500 తండాలను గ్రామ పంచాయతీలు చేయడంతో లంబాడీ బిడ్డలే సర్పంచులుగా రాజ్యమేలుతున్నారు. దాని వల్ల తాండూరు పరిధిలోని ప్రజలు చాలా మంది లబ్ధి పొందుతున్నారు. బంజారా గౌరవానికి చిహ్నంగా బంజారాహిల్స్‌లో బంజారా భవన్ నిర్మించాం. భారాసకు మద్దతు తెలిపిన సేవాలాల్ సంఘానికి నా కృతజ్ఞతలు" అని కేసీఆర్ వివరించారు.



## ఓటరు ఓసారి ఆలోచించు....

ఢిల్లీ, కర్ణాటక పెద్దలు చెబితే మనం వినే ప్రభుత్వం రావాలా, లేదా మనం చెబితే ఢిల్లీ పెద్దలు వినే ప్రభుత్వం రావాలా...ప్రధానమంత్రిని ఎన్నుకునే ఎన్నికల్లో ఎవరికైనా ఓటు వేయొచ్చేమో కానీ, స్థానిక ముఖ్య మంత్రి ఎన్నికల్లో మాత్రం చెన్నై రాష్ట్రంలోలా మన స్థానిక ప్రభుత్వం ఉండాలి, మనం అభివృద్ధి చెందాలంటే....శంషాబాద్ ఎయిర్పోర్ట్ కు పీ.వీ.నరసింహారావు( బహుభాషా కోవిదుడు, దేశ ప్రధానిగా మన దేశ ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించారన్న ఘన కీర్తి కలిగిన అపర మేధావి) పేరు పెట్టాలని రాష్ట్ర పెద్దలందరూ తీర్మానించినప్పటికీ చివరి నిమిషంలో మరో పేరు వచ్చేసింది. కొసమెరుపు ఏమిటంటే పీ.వీ నరసింహారావు కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రధానమంత్రి అయినప్ప టికీ ఆయన పేరును చివరి నిమిషంలో శంషాబాద్ ఎయిర్పోర్ట్ కు పెట్టకుండా మరో పేరు పెట్టారు, ఒక్కసారి ఆలోచించండి ఇలాంటి పెద్దలు రేపు మన రాష్ట్రానికి ఎంత మేర న్యాయం చేస్తారో ...వి.వి

# దంగునోట్ల రాజకీయం

## ప్రలోభాలకు అడ్డేలేదా ?




## ఐదు రాష్ట్రాలు.. రూ.1,760 కోట్లు.. తెలంగాణకు టాప్ ప్లేసు!

హైదరాబాద్ : ఎన్నికల సీజన్ వచ్చిందంటే ధన ప్రవాహం విపరీతంగా జరుగుతుందని.. ఇక మరికొన్ని రూపాల్లో విచ్చలవిడిగా దర్శనమిస్తుందనేది తెలిసిన విషయమే. ఎన్నికల్లో డబ్బు ప్రభావం చాలా అధికంగా ఉంటుందని పరిశీలకు, ప్రజాస్వామ్యవాదులు ఆందోళనలు వ్యక్తం చేస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలో తాజాగా ఎన్నికలు జరుగుతున్న ఐదురాష్ట్రాల్లో పట్టుబడిన నగదు ఇతర వివరాలు ఈసీ వెల్లడించింది. అవును... దేశంలో ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం అధికారులు, పోలీసులు జరిపిన తనిఖీల్లో భారీ మొత్తంలో సొమ్ము లభ్యమైనట్లు నిత్యం వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మొత్తం ఐదు రాష్ట్రాల్లో కలిపి ఓటర్లను ప్రలోభపెట్టేందుకు రూ. 1760 కోట్ల విలువైన నగదు, బంగారం, వెండి, డ్రగ్స్, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా... అక్టోబరు 9న నుంచి ఇప్పటివరకూ ఐదు రాష్ట్రాల్లో నగదు, మద్యం, డ్రగ్స్, ఇతర వస్తువుల రూపంలో ఈ మొత్తం పట్టుపడినట్లు ఎలక్షన్ కమిషన్ ప్రకటించింది. ఈ రాష్ట్రాల్లో 2018 ఎన్నికల్లో పట్టుబడిన మొత్తం కంటే ఈసారి పట్టుబడినమొత్తం సుమారు ఏడు రెట్లని పేర్కొంది. గత ఎన్నికల్లో ఈ రాష్ట్రాల్లో రూ.239.15 కోట్ల విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను ఎన్నికల కమిషన్ జప్తు చేసింది. ఈ ఐదు రాష్ట్రాల్లో తెలంగాణలోనే అత్యధికంగా సొత్తు పట్టుబడటం గమనార్హం.

ఇప్పటికే తెలంగాణలో సుమారు రూ.225.25 కోట్ల నగదు సహా మొత్తం రూ.659.2 కోట్ల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఈసీ వెల్లడించింది. దీంతో... ఎన్నికలు ముగిసేనాటికి ఈ గణాంకాలు మరింతగా పెరిగే అవకాశాలున్నాయనే కామెంట్లు వినిపిస్తున్నాయి. ఇక రాజస్థాన్ రాష్ట్రంలో రూ.650.7 కోట్లు, మధ్యప్రదే శ్ రాష్ట్రంలో రూ.323.72 కోట్లు, ఛత్తీస్ గఢ్ రూ. 76.9 కోట్లు, మిజోరం 49.6 కోట్ల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల కమిషన్ పేర్కొంది. ఈ క్రమంలో... ఎన్నికలు జరుగుతున్న ఐదు రాష్ట్రాల్లో చీఫ్ సెక్రటరీలు, డీజీపీలు, ఎక్సైజ్ కమిషనర్లు, ఐటీ అధికారులతో కేంద్ర ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు సమీక్ష జరుపుతోంది. ఇందులో భాగంగా సుమారు 228 మంది కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులను ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాలకు అబ్జర్వర్లుగా నియమించిన సంగతి తెలిసిందే.

కాగా... తాజాగా అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న ఐదు రాష్ట్రాల్లో ఇప్పటికే మధ్యప్రదేశ్, ఛత్తీస్ గఢ్, మిజోరంలలో పోలింగ్ ముగిసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో నవంబర్ 25న రాజస్థాన్, నవంబర్ 30న తెలంగాణలో పోలింగ్ జరగనుంది

# సంపాదకీయం

## తెలంగాణ సెంటిమెంట్ ఈసారి ఎంత...?

ఈసారి జరిగే తెలంగాణా ఎన్నికల్లో తెలంగాణా సెంటిమెంట్ ఎంత. ఈ ప్రశ్న అందరిలోనూ చాలా ఎక్కువగానే ఉంది. ఎందుకంటే సెంటిమెంట్ ని బాగా ప్రయోగిస్తోంది అధికార బీయారెస్. ఎన్నికల ప్రచారం మొదట్లో సెంటిమెంట్ విషయం తీసుకుని రాలేకపోయినా కాంగ్రెస్ గ్రాఫ్ పెరిగిన తరువాత మాత్రం అధికార బీయారెస్ నేతలు తెలంగాణా అంటే కేసీయార్ మాత్రమే అంటూ గంభీరమైన ప్రకటనలు చేస్తూ వస్తున్నారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ తెలంగాణా ఇవ్వలేదు అని అంటున్నారు. తాము పోరాడి తెచ్చామని చెబుతున్నారు. మంత్రి హరీష్ రావు దీని మీద ఒక వ్యాఖ్య చేశారు. బ్రిటిష్ వారు ఈ దేశానికి స్వాతంత్రం తామే ఇచ్చామని చెబితే ఎలా ఉంటుంది అని ఆయన ప్రశ్నిస్తున్నారు. భారత ప్రజలు తెల్ల దొరలతో కొట్లాడి స్వాతంత్రం తీసుకుని వచ్చారని ఆయన అంటూ అదే నీతి తెలంగాణా రాష్ట్ర సాధనకూ వర్తిస్తుంది అని అంటున్నారు. తెలంగాణా రాష్ట్రం వచ్చింది అంటే కేసీయార్ పోరాటం పటిమ అని అతు కేటీయార్ ఇటు హరీష్ రావు చెబుతున్నారు. ఇక కేసీయార్ అయితే తాను పాల్గొన్న ప్రతీ సభలోనూ ఒక్కటే మాట చెబుతున్నారు. కేసీయార్ చచ్చుడో తెలంగాణా వచ్చుడో అన్న నినాదంతో తాను అమరణ నిరాహార దీక్షకు దిగానని అపుడే తెలంగాణా ప్రకటన చేశారని, ఆయన 2009 డిసెంబర్ 9ని గుర్తు చేస్తున్నారు. ఆ ప్రకటన తరువాత నాలుగేళ్ళకు కానీ తెలంగాణా రాలేదని కూడా అంటున్నారు. దాని కంటే ముందు 2004లో తెలంగాణా ఇస్తామని అంటేనే కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకుని పోటీ చేశామని తీరా కేంద్రంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ నేతలు పదేళ్ల పాటు తెలంగాణా ఊసు మరచిపోయారని కూడా విమర్శిస్తున్నారు. తెలంగాణా తెచ్చాం, పదేళ్ళలో అభివృద్ధి చేశాం, ఇంకా చేయాల్సింది చాలా ఉంది. ఇపుడు తెలంగాణాను తీసుకెళ్ళి కాంగ్రెస్ కి అప్పగిద్దామా అని కూడా బీయారెస్ నేతలు ప్రజలను ప్రశ్నిస్తున్నారు గతంలో కాంగ్రెస్ చాలా కాలం ఉమ్మడి ఏపీలో తెలంగాణాను పాలించిందని, ఆ పార్టీ తెలంగాణాకు ఏమీ చేయలేదని కూడా బీయారెస్ నేతలు చెబుతున్నారు. మళ్లీ అలాంటి పరిస్థితి వస్తుందని హెచ్చరిస్తున్నారు. తెలంగాణా అంటే బీయారెస్ అని కూడా చెబుతున్నారు. ఇంతలా తెలంగాణా నినాదాన్ని చేస్తూ సెంటిమెంట్ ని పండిస్తూ బీయారెస్ నేతలు జనంలోకి వెళ్తున్నారు. ఇవన్నీ సరే కానీ 2014లో అయినా తెలంగాణా ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనే కదా అన్నది ఒక ప్రశ్న. అంతే కాదు తెలంగాణా ఇచ్చిన కాంగ్రెస్ కి అప్పట్లో జనం ఓటేయలేదు, తెచ్చామని అన్నందుకే బీయారెస్ కి వేశారు. ఒకటికి రెండు సార్లు అధికారం కట్టబెట్టారు. ఇపుడు కాంగ్రెస్ కి ఒక్క చాన్స్ ఇస్తే తప్పేంటి అన్న భావన అయితే ఉంది అని సర్వేలు చెబుతున్నాయి. తెలంగాణా రాష్ట్రం అన్నది ఏ ఒక్క పార్టీ సొత్తు కాదు అని జనాలు భావిస్తే మాత్రం రాజకీయ మార్పు కచ్చితంగా వస్తుంది అని అంటున్నారు. అదే విధంగా కాంగ్రెస్ ని ఆదరించాలని చూస్తే కనుక ఆ పార్టీ అభివృద్ధి వ్యతిరేకి, తెలంగాణాను కుక్కలు చింపిన విస్తరి చేస్తుంది అన్న బీయారెస్ మాటలను జనాలు అసలు పట్టించుకోరు అని అంటున్నారు. మరో వైపు చూస్తే తెలంగాణా సెంటిమెంట్ కంటే పదేళ్ల కేసీయార్ పాలన మీదనే ఈసారి జనాలు తీర్పు ఇస్తారని అంటున్నారు. ఎమోషనల్ గా రియాక్ట్ అయ్యే తెలంగాణా జనాలు బీయారెస్ అడుగులో అడుగు వేస్తూ రెండు దశాబ్దాలకు పైగా నడిచారని, ఇపుడు వారు పాలనలో మార్పు కోరుకుంటే మాత్రం అధికార పీఠం కూడా వేరే చేతుల్లోకి వెళ్తుంది అని అంటున్నారు. తెలంగాణా సెంటిమెంట్ ఎంత ఉంది అన్నది మాత్రం ఇప్పటికిపుడు ఎవరూ చెప్పకపోయినా సెంటిమెంట్ల కంటే జనాల ఆకాంక్షలు వేరే విధంగా ఉంటే మాత్రం ఉల్టా సీదా అవుతుంది అని విశ్లేషిస్తున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# జిల్లా లో ఎన్నికల నిర్వహణ పారదర్శకంగా చేపడుతున్నాం...

### మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్.




జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజిగిరి (గరుడ వార్త): జిల్లాలో ఎన్నికల నిర్వహణ కు ఎలాంటి అనుమానాలకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తి పారదర్శకంగా చేపడుతున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ గౌతమ్ ఎన్నికల అధికారులకు తెలిపారుబుధవారం ఢిల్లీ నుండి సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్, తెలంగాణ రాష్ట్ర శాసనసభకు జరగబోయే సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో సమావేశంలో జిల్లా కలెక్టర్ గౌతమ్, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్రెడి, జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియ, సమీకృత జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్నారు. అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నిర్వహణ, ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ, బ్యాలెట్ పత్రాల ముద్రణ, ఈవిఎం యంత్రాల కమిషనింగ్, ఇంటి నుంచి ఓటు సేకరణ, పోలింగ్ సిబ్బంది శిక్షణ, రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ఏర్పాటు, తదితర అంశాలపై సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ జిల్లా కలెక్టర్ లకు పలు సూచనలు చేశారు. జిల్లాలో శాసనసభ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్, అన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గౌతమ్,మాట్లాడుతూ, కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డుల పంపిణీ ప్రక్రియ వేగవంతం చేశామని, ఓటింగ్ వివరాలతో కూడిన స్లిప్పులను సైతం ఇప్పటికే జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో సగటున 80 శాతం పంపిణీ పూర్తి చేశామని సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ దృష్టికి తెచ్చారు. అదేవిధంగా ఓటరు ఫోటో గుర్తింపు కార్డులు (ఎపిక్) లను పోస్టల్ శాఖ ద్వారా నేరుగా ఓటర్లకు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలింగ్ నిర్వహణ కోసం ఈవీఎం బ్యాలెట్, పోస్టల్ బ్యాలెట్, టెండర్ బ్యాలెట్ పేపర్ల ముద్రణ పూర్తయ్యిందని, కమిషనింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు వీలుగా ఈ.సీ.ఐ.ఎల్ ఇంజినీర్ల బృందాలు జిల్లాకు చేరుకున్నారని తెలిపారు. 80 ఏళ్ళు పైబడిన వృద్ధులు, 40 శాతానికి పైగా వైకల్యం కలిగిన దివ్యంగులు కలుపుకుని మొత్తం 1070 మంది ఓట్ ఫ్రమ్ హోమ్ సౌకర్యాన్ని వినియోగించుకునేందుకు అర్హులుగా గుర్తించామని, వారి ఇళ్ల వద్దకే వెళ్లి వారి ఓటును స్వీకరించేందుకు వీలుగా ప్రత్యేక పోలింగ్ బృందాలను ఏర్పాటు చేశామని అన్నారు. ఈ బృందాలు ఓట్ ఫ్రమ్ హోమ్ ప్రక్రియ చేపట్టేలా ప్రణాళికలు రూపొందించామని, ఈ.సీ నిబంధనలకు అనుగుణంగా పూర్తి గోప్యత పాటిస్తూ ఓటు సేకరణ జరిపేలా గట్టి చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు ఇప్పటికే రెండు విడతలుగా శిక్షణ తరగతులు ఏర్పాటు చేసి పోలింగ్ విధులపై పూర్తి అవగాహన కల్పించామన్నారు. శిక్షణ కేంద్రాల వద్దే ఫెసిలిటేషన్ సెంటర్ లను నెలకొల్పి పోలింగ్ విధుల్లో నియమించబడిన సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. పోలీసులు సహా ఇతర ఎన్నికల విధుల్లో నియమించబడిన సిబ్బంది కోసం రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశామని అన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు సంబంధించిన అంశాలను ఈ.సీ దృష్టికి తెచ్చేందుకు వీలుగా అందుబాటులోకి తెచ్చిన సీ.విజిల్ యాప్ గురించి విస్తృత ప్రచారం నిర్వహిస్తూ, ఆ యాప్ ను డౌన్ లోడ్ చేసుకోవాల్సిందిగా ప్రజలకు అవగాహన కల్పించామని అన్నారు. జిల్లా స్థాయిలోనూ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఫిర్యాదులను పరిష్కరిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. సువిధ పోర్టల్ ద్వారా ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు తదితర వాటి కోసం వచ్చే దరఖాస్తులను వెంటనే పరిశీలిస్తూ గడువులోపు అనుమతులు జారీ చేస్తున్నామని అన్నారు. పోలింగ్ నిర్వహణ కోసం రిసీవింగ్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను నెలకొల్పి పక్కాగా ఏర్పాట్లు చేశామని, తెలిపినారు వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా ఎన్నికల నోడల్ అధికారులు,కృష్ణారెడ్డి, దేవసహాయం, విజయకుమారి ఖాసీం సిబ్బంది పాల్గొన్నారు.



గులాబీ జెండా తెలంగాణ ప్రజల అభివృద్ధికి అండ మంత్రి మల్లారెడ్డి కెసిఆర్ ప్రభుత్వం తెలంగాణ ప్రజల ఆశయాలను ఆకాంక్షలను అర్థం చేసుకొని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్న ఏకైక ప్రభుత్వమని మంత్రి మల్లారెడ్డి అన్నా. బుధవారం షామీర్పేట్ మండల పరిధిలోని అలియాబాద్ లాల్ గడి మలక్పేట్ మజీద్ పూర్ యాడారం పొన్నాల బాబా గూడ గ్రామాల్లో మంత్రి మల్లారెడ్డి తన ఎన్నికల ప్రచారంలో భాగంగా భారీ ర్యాలీ నిర్వహిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూచామకుర మల్లారెడ్డికార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రివర్యులు ఎన్నికల ప్రచారంలో భాగంగా శామీర్ పేట్ మండలం లోని అలియా బాద్, లాల్ గడి మాలక్పేట్, మజీద్ పూర్, యాడారం గ్రామాలలో మంత్రి మల్లారెడ్డి భారీ ర్యాలీతో తన ఎన్నికల ప్రచారం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గులాబీ జెండా నిరుపేదలకు అండగా నిలిచిందని, కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రపంచంలో ఎక్కడా లేని పథకాలను రాష్ట్రంలో కెసిఆర్ అమలు చేశారన్నారు. అందులో భాగంగానే రైతుబంధు, రైతు బీమా, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, దళిత బందు, బీసీ బందు, కేసీఆర్ కిట్టు ఇలా ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిన ఘనత కేసిఆర్ గారి కే దక్కిందన్నారు. బీఆర్ఎస్ మరోసారి అధికారంలోకి రాగానే మహిళలకు ప్రతినెల 3 వేల రూపాయకు అందిస్తామని, 400 రూపాయలకే గ్యాస్ సిలిండర్ అందిస్తామని, ఆసరా పింఛన్లను ఐదువేలకు, వికలాంగుల పింఛను 6వేలకు, రైతుబంధును 16 వేలకు, ఆరోగ్యశ్రీ గరిష్ట పరిమితిని 15 లక్షల రూపాయలకు పెంచబోతున్నామని తెలిపారు. తెల్ల రేషన్ కార్డు గల ప్రతి ఒక్కరికి సన్న బియ్యం అందించడంతో పాటు ఐదు లక్షల రూపాయల బీమా వర్తింప వర్తింప చేస్తామన్నారు.ఇప్పటికే సొంత నిధులతో నియోజకవర్గం లోని గ్రామాలలో రోడ్లు వేయించానని తెలిపారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి అసెంబ్లీకి పంపితే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రచార ర్యాలీలో మంత్రి తో పాటు షామీర్పేట్ మండల అధ్యక్షుడు సుదర్శన్, మండల ఎంపిపి ఎల్లుబాయి, జడ్పిటిసి అనితల లాలయ్యతో పాటుగా అలియాబాద్ గ్రామ సర్పంచ్ గురుకు కుమార్, ఎంపీటీసీ కోడూరు అశోక్, మాజీ సర్పంచ్ గూదే ఎల్లయ్య, సీనియర్ నాయకులు జగదీష్ గౌడ్, వార్డు సభ్యులు లింగం తోపాటుగా వివిధ గ్రామాల సర్పంచులు వార్డ్ సభ్యులు బి.ఆర్.ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు మండల స్థాయి నాయకులు ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

## కాంగ్రెస్ పార్టీలో తగ్గని చేరికల పర్వం

**కాంగ్రెస్ పార్టీలో చేరిన తూముకుంట మాజీ సర్పంచ్ ఎద్దు నాగేష్ తోపాటుగా పలువురు ప్రజాప్రతినిధులు ...**

**వజ్రేష్ యాదవ్ గెలుపు తథ్యం**

**సీనియర్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్.**

మీర్ పేట (గరుడ వార్త) : బిఆర్ఎస్ పార్టీ రోజురోజుకు దాని ప్రాబల్యాన్ని కోల్పోతుందని సీనియర్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్ అన్నారు. బుధవారం తూముకుంట మాజీ సర్పంచ్ ఎద్దు నగేష్ తో పాటుగా పలువురు ప్రజాప్రతినిధులు మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, సీనియర్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాబోవు కాలంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం తథ్యమని, రోజురోజుకు పెరుగుతున్న చేరికలు అందుకు నిదర్శనం అన్నారు.



కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే తప్పక రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి చూపుతామని నక్క ప్రభాకర్ గౌడ్ అన్నారు. దేశవ్యాప్తంగా ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపే నమ్మకంగా చూస్తున్నారని మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే భూ బకాసురుల భరతం పడతామని సుధీర్ రెడ్డి హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# దృష్టి సారిస్తేనే పూర్వవైభవం

చేగుంట: ప్రజలకు ఆహ్లాదాన్ని పంచిన వల్లూరు నర్సరీ నిర్వహణ కొరవడి అధ్వానంగా మారింది. గతంలో నిత్యం పర్యాటకులతో కళకళలాడిన ఆ ప్రాంతం నేడు వెలవెలబోతోంది. 17 ఏళ్ల కిందట 44వ జాతీయ రహదారి పక్కనే దీనిని ఏర్పాటు చేశారు. అప్పట్లోనే రూ.6 కోట్లు వెచ్చించి అభివృద్ధి చేశారు. ఇందులో మొక్కల పెంపకం చేపట్టడంతో అవి ఏపుగా పెరిగి ప్రశాంత వాతవరణం నెలకొంది. ఆ దారిలో ప్రయాణించేవారు కొద్దిసేపు సేదదీరి వెళ్లేవారు. చెక్‌డ్యాంలు, చిన్న నీటికొలను నిర్మించారు. అలాగే వివిధ రకాల జంతువులు, పక్షుల పెంపకం చేపట్టారు. 35 రకాల ఔషధ మొక్కలు ఉండేవి. మెదక్, ఆదిలాబాద్, కామారెడ్డి, నిజామాబాద్, హైదరాబాద్ నుంచి



విద్యార్థులు సందర్శించేవారు. రానురాను అటవీ అధికారులు పట్టించుకోలేదు. ప్రస్తుతం చెట్లు తప్ప, మిగతావి ఏమీ కనిపించడం లేదు. పూర్వవైభవం తీసుకుని వస్తామని అధికారులు చెబుతున్నా పరిస్థితిలో మార్పు లేదు. మెదక్, కామారెడ్డి, నిజామాబాద్, అదిలాబాద్ కరీంనగర్, సిరిసిల్ల సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాలతో పాటు దూలపల్లి అటవీ అకాడమీకి చెందిన ఐఎఫ్ఎస్ అధికారులు, శిక్షణలో ఉండే ఎఫ్ఆర్వోలు, బీట్ అధికారులు వీఎస్ఎస్ సిబ్బందికి దీనిని శిక్షణ కేంద్రంగా ఉపయోగించారు. ఇపుడా పరిస్థితి లేదు. ఇక్కడ వసతుల కల్పనకు నిధులు మంజూరు చేసి పక్కా కార్యాచరణతో అడుగేస్తేనే పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దే అవకాశం ఉంది.

**ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం**

నర్సరీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. నిధులు ఇవ్వాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. మొక్కల పెంపకంపైనే దృష్టి కేంద్రీకరించాం. పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాం.

విద్యాసాగర్, ఎఫ్ఆర్వో, రామాయంపేట

# విద్యాదీప్తి... నైపుణ్యప్రాప్తి

చేగుంట:కరోనా సమయంలో మొదలైన శిబిరంతో ప్రయోజనాలు ఉండటంతో ఆ తర్వాతి ఏడాది 8 చోట్ల ఏర్పాటుచేశారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకొని జిల్లాలోని మరికొన్ని గ్రామాల్లో ఈ ప్రక్రియ షురూ చేశారు. ఇలా ఈ సారి 48 పఠన శిబిరాలు కొలువుదీరడం గమనార్హం. వీటికితోడు ఎన్జీవోల సహకారంతో మరో 62 చోట్ల వీటిని ఏర్పాటుచేసి కొనసాగిస్తున్నారు. వీటిల్లో బోధించే వాలంటీర్లకు ఎలాంటి వేతనం ఇవ్వరు. స్వచ్ఛందంగా పాఠాలు బోధించాల్సి ఉంటుంది. అప్పాయిపల్లి గ్రామంలోని ఓ శిబిరంలో సర్పంచి గీతా ఠాగూర్ స్వయంగా పాఠాలు బోధిస్తున్నారు. మరికొన్ని చోట్ల ఉపాధ్యాయులు, యువకులు ముందుకొచ్చి తరగతులు చెబుతున్నారు.

**ఆయా అంశాలపై..** వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయం వృథా చేసుకోకుండా ఉండేందుకు వీటి ఏర్పాటుకు గ్రామస్థులు మొగ్గు చూపుతున్నారు. నిత్యం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు శిబిరాన్ని కొనసాగిస్తారు. ఉపాధ్యాయులు ఆయా అంశాల్లో పాఠాలు బోధిస్తారు. రాయడంలోనూ తీర్చిదిద్దుతారు. విద్యతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తారు. గుణింతాలు, ఆంగ్లంలో మాట్లాడటం, ఎవరితో ఎలా మాట్లాడాలి, ఇతరులను గౌరవించడం ఎలా, నైతిక విలువలు, ఆరోగ్యంగా ఉండేందుకు చిట్కాలు, ధాన్యం, యోగా, సంగీతం, నృత్యం, ఆటలు, పాటలు, చిత్రలేఖనం, ఆధ్యాత్మికత, దేశభక్తి, వివిధ కళలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఆయా రంగాల్లో అనుభవజ్ఞులైన వారిని పాఠశాలకు పిలిచి విద్యార్థులకు అర్థమయ్యేలా వివరిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో వికారాబాద్, మంతన్‌గౌడ్, మర్పల్లి, నస్కల్, నాగిరెడ్డిపల్లి, ఉడిమేశ్వరం, చిన్ననందిగామ, బుల్కాపూర్ తదితర చోట్ల కొనసాగుతున్నాయి.

**చదువుకు దూరం కాకుండా..** ప్రజా సేవ కంటే విద్యార్థులకు బోధించడం ఎంతో సంతోషాన్నిస్తోంది. తనతో పాటు మరో 8 మంది స్వచ్ఛందంగా ముందుకొచ్చి తరగతులు చెబుతున్నారు. వేసవిలో పిల్లలు చదువుకు దూరం కాకుండా ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతోంది.

గీతాఠాగూర్, సర్పంచి, అప్పాయిపల్లి

**బొమ్మలు గీయడం వచ్చింది..**

బొమ్మలు ఎలా గీయాలి.. రంగులెలా వేయాలో నేర్చుకున్నా. ఆంగ్లంలో మాట్లాడే పదాలను తెలుసుకున్నా. వీటితో పాటు అన్ని ఆటలు ఆడే విధానం, మెలకువలు తెలుసుకున్నా. ఆట పాటలతో చదువుకోవడం సెలవుల్లో సరదా అనిపిస్తోంది.

కార్తీక్ రాథోడ్, విద్యార్థి

**గుణింతాలు నేర్చుకున్నా**

గణితంలో మెలకువలు నేర్చుకున్నాను. వేసవి శిబిరంలో 6 నుంచి 20 వరకు గుణింతాలు నేర్చుకోగలిగా. చిత్రాలు గీయడం, దేశభక్తి గీతాల ఆలాపన, మహనీయుల జీవిత చరిత్రలు చదివాను. ఆట పాటలతో చదువుకుంటూ సెలవులను సరదాగా గడుపుతున్నా.

హారిక, విద్యార్థిని

**ఇతర రాష్ట్రాల్లో సైతం..**

వికారాబాద్ జిల్లాలో కొనసాగుతున్న పఠన శిబిరాల గురించి తెలియడంతో దిల్లీకి చెందిన ఓ బృందం అప్పాయిపల్లికి వచ్చారు. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి చూసి ఎంతో సంతోషించారు. వేసవి పఠన శిబిరాలు సత్ఫలితాలు అందిస్తున్నాయని గ్రహించారు. పిల్లలను అన్ని రకాలుగా పరీక్షించారు. ప్రతిభ చూపగా ప్రశంసించారు. ఇలాంటి ప్రయోగాన్ని ఇతర జిల్లాలు, రాష్ట్రాల్లో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**రెండు నెలల పాటు..** వేసవి శిబిరానికి చిన్నారులు ఆసక్తిగా వస్తున్నారు. చదువుతో పాటు ఆటలు, నృత్యాలు, కర్రసాము వంటి విద్యార్థులకు తెలియని ఆటలు, వ్యక్తిగత రక్షణకు ఉపయుక్తమైన వాటిని వివరిస్తున్నాం. నేర్పించిన వాటిపై విద్యార్థులు నైపుణ్యం ప్రదర్శించారు. దిల్లీ బృందం సభ్యులు సైతం ప్రశంసించింది. వీరేశం, ఉపాధ్యాయుడు

# పోరు త్రిముఖమే

భువనగిరి : ప్రచారానికి ఇక 9 రోజులే మిగిలింది. ఓటర్లను ఆకర్షించేందుకు ప్రచారం హోరెత్తుతోంది. భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 19 మంది పోటీలో ఉన్నారు. భారాస నుంచి పైళ్ల శేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, భాజపా తరఫున గూడూరు నారాయణరెడ్డి, సీపీఎం నుంచి కొండమడుగు నర్సింహాతో పాటు ఇతర పార్టీలు, స్వతంత్రులు మరో 15 మంది పోటీ పడుతున్నారు. త్రిముఖ పోటీ నెలకొంది. నామినేషన్ల వేళనే జనసమీకరణతో సత్తా చాటిన భారాస, కాంగ్రెస్, భాజపాలు ప్రచారంలో కొత్త ఎత్తుగడలతో ముందుకు సాగుతున్నాయి. సీపీఎం, ట్రిపుల్ ఆర్ బాధిత సంఘం నుంచి పోటీలో ఉన్న అవిశెట్టి పాండు కూడా ప్రచారంలో ఉన్నారు. ఇతర రిజిస్టర్డ్ పార్టీలు, స్వతంత్రులు ప్రచారానికి సన్నద్ధమవుతున్నారు. ప్రచారంలో భారాస అభ్యర్థి శేఖర్‌రెడ్డి తరఫున భార్య, కూతురు ప్రచారం చేస్తున్నారు. గతంలో పోటీచేసిన అనుభవం ఉన్న పార్టీ సీనియర్ నాయకులు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, జిట్టా బాలకృష్ణారెడ్డి వ్యూహాత్మకంగా ప్రచారం సాగిస్తున్నారు.కుల సంఘాలు, మైనార్టీల మద్దతు కూడగట్టేందుకు ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. చేరికలపైనే దృష్టిపెట్టారు. కేటీఆర్, హరీశ్‌రావు రోడ్‌షోలకు సన్నాహాలు చేస్తున్నారు.



సీపీఎం అభ్యర్థి కొండమడుగు నర్సింహ ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడుతూ ప్రచారం సాగిస్తున్నారు. ఇంటింటా ప్రచారం, కళాబృందాల ప్రదర్శనలు సాగుతున్నాయి. ఈ నెల 27న భువనగిరిలో పార్టీ నాయకుడు సీతారాం ఏచూరి రోడ్‌షో నిర్వహించనున్నారు.

అదే వేగంతో కాంగ్రెస్

కాంగ్రెస్ అభ్యర్థి కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ప్రచారంలో వేగం పెంచారు. భారాసకు తీసిపోకుండా ప్రచార ఎత్తుగడ వేస్తున్నారు. అసమ్మతిని చల్లార్చి దాదాపు పార్టీ ముఖ్యనాయకులందరిని ప్రచార సమరంలో దించడంలో సఫలమయ్యారు. భార్య, కూతురు, కుమారుడు పార్టీ శ్రేణులతో కలిసి ఓటర్లను కలుస్తున్నారు. గతంలో పోటీచేసిన అనుభవంతో కొత్త పొరపాట్లకు ఆస్కారం ఇవ్వకుండా కుంభం జాగ్రత్తపడుతున్నారు. తాను ఒక వైపు, కుటుంబసభ్యులు మరోవైపు ప్రచారంలో పాల్గొంటున్నారు. భువనగిరి పట్టణంపై దృష్టిపెట్టారు. జడ్పీ మాజీ ఛైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్‌కుమార్, టీపీసీసీ సభ్యుడు తంగెళ్లపల్లి రవికుమార్, మండల నాయకులు ప్రచార బాధ్యతలు చూస్తున్నారు.


రెండు పార్టీలకు తీసిపోకుండా భాజపా...

భారాస, కాంగ్రెస్ పార్టీలకు తీసి పోకుండా ఒక్కసారి అవకాశం ఇవ్వాలని భాజపా అభ్యర్థి గూడూరు నారాయణరెడ్డి ప్రచారం సాగిస్తున్నారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో ఇంటింటి ప్రచారం జోరందుకుంది. పార్టీ హామీలతో పాటు నియోజకవర్గ మేనిఫెస్టోను తయారు చేసి ఇంటింటా కరపత్రాలు పంచుతున్నారు. వలిగొండ మండలాన్ని హెచ్‌ఎండీఏలో కలపడంతో పాటు భువనగిరి పట్టణంలో తన తండ్రిపేర డిగ్రీ కళాశాల భవనం నిర్మించి ప్రభుత్వానికి అప్పగిస్తానని హామీ ఇస్తున్నారు. మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌రావు ప్రచారం చేస్తున్నారు. పార్టీ స్టార్ క్యాంపెయినర్లు రాజాసింగ్, కిషన్‌రెడ్డి, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సభలకు కూడా సన్నాహాలు చేస్తున్నారు.

# వరి కోతలతో అభ్యర్థులకు తప్పని తిప్పలు

హుజూర్‌నగర్ : ఇది నియోజకవర్గంలోని ఓ ప్రధాన పార్టీ అభ్యర్థికి, ఓ సర్పంచికి మధ్య జరిగిన ఫోన్ సంభాషణ. ఉమ్మడి జిల్లాలో వరికోతలు ప్రారంభం కావడంతో గ్రామాల్లో ప్రచారంలో ముందుండే నాయకులు వ్యవసాయ పనులకు వెళ్తున్నారు. దీంతో ప్రచారం మందకొడిగా సాగుతుంది. ప్రధాన పార్టీలన్నింటికీ వరి కోతల ఇబ్బందులు మొదలయ్యాయి. ఒక వైపు మబ్బులు పడుతుండటంతో రైతులు వరికోతలపై దృష్టి సారించారు. చాలా మంది రైతులు వారి గ్రామాల రాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తున్న వారే ఉన్నారు. ఎన్నికలు దగ్గర పడుతుండటం, అందులోనే కోతలు, కల్లాలు అంటూ పోతే తమ పరిస్థితి ఏమిటని నాయకులు తలలు పట్టుకుంటున్నారు. చాలా మంది రైతులు నాయకులే..ఈ కోతలు మరో 20 రోజుల పాటు సాగుతాయి. యాసంగి పంటను కాపాడుకునేందుకు రైతులు నానా తిప్పలు పడ్డారు. దిగుబడి కూడా ఆశాజనకంగా ఉండటంతో రైతులు దగ్గరుండి వరికోతలు కోయించుకుంటున్నారు. ఇంతవరకు బాగానే ఉంది కానీ చాలా మంది నాయకులు రైతులు కావడంతో ప్రధాన పార్టీ అభ్యర్థులకు కొత్త చిక్కులు వచ్చి పడ్డాయి. అభ్యర్థులు కొందరు కీలక నాయకులను బతిమాలి బంధువులను పిలిపించుకొని వరి కోతలు కోయించాలని సూచిస్తున్నారు. వరి కోసి కుప్ప వేయడమే అయితే పనిని వేరే వారికి అప్పగించవచ్చు. కానీ వరి కోత యంత్రంతో వరి కోయడం, వెంటనే ధాన్యాన్ని వ్యాపారులతో మాట్లాడుకొని కల్లాల వద్దే అమ్ముకునే పరిస్థితి కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో ఉంది. మిగిలిన ప్రాంతాల్లో ధాన్యాన్ని మార్కెట్‌కు తరలించి అమ్ముకునే పనులు కూడా ఉండటంతో రైతులు వ్యవసాయ పనులు వదిలి రాజకీయ ప్రచారాలకు వచ్చే పరిస్థితి లేదు. చాలా మంది కూలీలు రోజు వారి ప్రచారాలకు కూలీకి వెళ్తుండటంతో కోతలకు రావడం లేదని రైతులు అంటున్నారు. వీరికి రోజుకు మూడు వందలు ఇచ్చి, భోజనాలు కూడా పెడుతుండటంతో ఎక్కువ మంది మహిళలు ఎన్నికల ప్రచారానికి మొగ్గు చూపుతున్నారని రైతులు అంటున్నారు. ఒకే సారి వరి కోతలు, ఎన్నికలు రావడంతో రైతులకు, అభ్యర్థులకు ఇద్దరికీ తిప్పలు వచ్చి పడ్డాయని ఇరు వర్గాలు వాపోతున్నాయి.

# ఓటేస్తాం.. బాటెయ్యండి



పెద్దపల్లి : ఓటు హక్కు వినియోగంలో ఉమ్మడి జిల్లా ప్రజలు ఆదర్శంగా నిలుస్తున్నారు. పోలింగ్ కేంద్రాలు దూరాన ఉన్నా బాధ్యతను మరవడం లేదు. వాగులు, వంకలు దాటి స్వేచ్ఛగా ఓటేస్తున్నారు. కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన తప్ప, ఆవాస గ్రామాల ఓటర్ల కష్టాలను అధికారులు పట్టించుకోవడం లేదు. పోలింగ్ కేంద్రాలకు దూరంగా ఉన్న అనుబంధ గ్రామాల్లో పోలింగ్ శాతం పెంపునకు ఓటర్లకు ప్రయాణ వసతి కల్పించాలి. పలు చోట్ల వృద్ధులు, మహిళలు కాలినకడన వెళ్లేందుకు వెనుకాడుతున్నారు. అధికారులు వాహనాలను సమకూరిస్తే పోలింగ్ శాతం పెరగనుంది. ఆవాస గ్రామాలు మరో పంచాయతీ కేంద్రానికి సమీపంలో ఉన్నా నిబంధనలు అడ్డు రావడంతో ఓటర్లకు దూరాభారం తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమీపంలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

వానొస్తే 60 కిలోమీటర్ల ప్రయాణం

ముత్తారం మండలం పారుపల్లి పంచాయతీ పరిధి శాత్రాజ్‌పల్లిలో 93 మంది ఓటర్లున్నారు. వీరు ప్రతి ఎన్నికల్లోనూ మానేరు వాగుకు అవతలి వైపు 3 కి.మీ.ల దూరంలోని పారుపల్లికి కాలినడనక వెళ్లి ఓటేస్తున్నారు. భారీ వర్షాలు కురిస్తే కరీంనగర్ జిల్లా జమ్మికుంట, వావిలాల మీదుగా కాల్వశ్రీరాంపూర్ మండలం నుంచి సుమారు 60 కి.మీ.లు ప్రయాణించాల్సి ఉంటుంది. ఇన్ని ఇబ్బందులున్నా ప్రతి ఎన్నికల్లో వంద శాతం పోలింగ్ నమోదవడం విశేషం. ఇటీవల పారుపల్లిలో పోలింగ్ కేంద్రం పరిశీలన కోసం సాధారణ పరిశీలకుడు, అధికారులు ట్రాక్టరులో మానేరు వాగు దాటారు. అందరూ ఓటేసేలా అధికారులు వాహనాలు ఏర్పాటు చేయాలని పరిశీలకుడు సూచించారు.

కష్టమైనా ఇష్టంగానే..

రాయికల్ మండలం బోర్నపల్లి పంచాయతీ అనుబంధ గ్రామం లోయగూడెంలో 11 కుటుంబాలున్నాయి. ఇక్కడ 21 మంది ఓటర్లుండగా ప్రతి ఎన్నికల్లో 3 కి.మీ.ల దూరంలోని బోర్నపల్లికి వెళ్లి ఓటేయాల్సి వస్తోంది. ఇదే మండలంలో ఆల్యానాయక్ పంచాయతీ కొత్తగా ఏర్పాటైంది. ఈ గ్రామంలోని మూడు తండాల ఓటర్లు సుమారు 515 మంది 2 కి.మీ.ల దూరంలోని తాట్లవాయి ప్రాథమిక పాఠశాలలోని పోలింగ్ కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. ఈ రెండు గ్రామాల ఓటర్లు ఎంత కష్టమైనా ఓటు వేయడం మాత్రం మరవడం లేదు.

9 కిలోమీటర్ల దూరాన

ధర్మారం మండలం కళ్లెంరెడ్డిపల్లి గ్రామం కమ్మర్‌ఖాన్‌పేట పంచాయతీకి అనుబంధంగా ఉంది. ఇక్కడ 152 మంది ఓటర్లుండగా సుమారు 9 కిలోమీటర్ల దూరంలోని కమ్మర్‌ఖాన్‌పేట ప్రాథమికోన్నత పాఠశాల పోలింగ్ కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. రెండు గ్రామాల మధ్య చెరువు ఉండగా, నేరుగా రహదారి లేదు. దీంతో చొప్పదండి మండలం గంటలపల్లి, ఆర్నకొండ మీదుగా ధర్మారం మండలం మల్లాపూర్ శివారు నుంచి జూలపల్లికి వెళ్లే మార్గంలో కమ్మర్‌ఖాన్‌పేటకు చేరుకోవాల్సి ఉంటుంది. అంటే రానుపోను దాదాపు 18 కిలోమీటర్లు ప్రయాణించాలి. ప్రతి ఎన్నికల్లో అభ్యర్థులు, నాయకులు ఏర్పాటు చేసే వాహనాల్లో వెళ్లి ఓటు వేస్తున్నామని గ్రామస్థులు తెలిపారు.

భవనాలున్నా ఇదేం గోస!

సారంగాపూర్ మండలంలో కొత్తగా మ్యాడారం, లచ్చునాయక్‌తండా, బీంరెడ్డిగూడెం, నాయకపుగూడెం, వడ్డెరకాలనీ, పోచంపేట, ధర్మనాయక్‌తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. ఒక్కో గ్రామంలో 300 మంది ఓటర్లున్నా స్థానికంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. దీంతో పాత పంచాయతీ కేంద్రానికే వెళ్లి ఓటేయాల్సిన పరిస్థితి. స్థానికంగా పాఠశాలల పక్కా భవనాలున్నా దూరా భారం తప్పడం లేదని ఓటర్లు ఆవేదన చెందుతున్నారు. బీంరెడ్డిగూడెం గ్రామానికి పూర్తి స్థాయిలో రహదారి నిర్మించకపోవడంతో చెరువు గట్టుపై నుంచే పోలింగ్ కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది.

ఓటర్లు వందల్లో ఉన్నా..

హుజూరాబాద్ మండలం చెల్పూరు పంచాయతీ పరిధిలోని కురుమపల్లి గ్రామ జనాభా 150. గ్రామానికి చెందిన 98 మంది ఓటర్లు చెల్పూరు జడ్పీ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. దీంతో సుమారు రెండున్నర కిలోమీటర్లు ప్రయాణించాలి. అయినప్పటికీ గ్రామస్థులు తప్పకుండా ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు.

హుజూరాబాద్ మండలం రాంపూర్ పంచాయతీ పరిధి గొల్లపల్లి జనాభా 200. గ్రామంలోని 109 మంది ఓటర్లకు రాంపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఓటు వేయడానికి దాదాపు 3 కిలోమీటర్లు నడవాల్సి వస్తోంది.

బీర్‌పూర్ మండలం తుంగూరు పంచాయతీ నుంచి కందెనకుంటను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేశారు. తుంగూరు సమీపంలోని నాయకపుగూడెంను ఇందులో విలీనం చేశారు. కుందెనకుంటలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడంతో నాయకపుగూడెం వాసులు నాలుగు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి ఉంటుంది. పక్కనే ఉన్న గ్రామంలో కాకుండా ఇంతర దూరం వెళ్లి ఓటేయడానికి ఇబ్బందులు తప్పేలా లేవు. మండలంలోని వాగొడ్డు రామన్నపల్లె 2018లో పంచాయతీగా ఏర్పడింది. ఈ గ్రామంలో 434 మంది ఓటర్లుండగా 1.5 కి.మీ.ల దూరంలోని మల్యాల పంచాయతీలో ఓటు వేయాల్సి వస్తోంది. మల్లన్నపల్లెలోని 600 మంది ఓటర్లు కిలోమీటరు దూరంలోని రాచపల్లిలో, గడ్డివానిపల్లెకు చెందిన 680 మంది ఓటర్లు కిలోమీటరు దూరంలోని టేకుర్తిలో ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు.

# 1 కాలనీ 2 నియోజకవర్గాలు



రామగుండం : నగరపాలక సంస్థ పరిధిలోకి వచ్చే యైటింక్లయిన్‌కాలనీ ప్రాంతం ఓ ప్రత్యేకతను సంతరించుకుంది. 1979లో సింగరేణి యాజమాన్యం ఏర్పాటు చేసిన కాలనీలో ప్రస్తుత జనాభా 38 వేలు. కాగా కాలనీ ఓవైపు రామగుండం నియోజకవర్గ పరిధిలోకి వస్తుండగా, మరోవైపు మంథని పరిధిలోకి వస్తోంది. స్థానిక వ్యాపారస ముదాయం, గాంధీనగర్, కుమారస్వామినగర్, ఓల్డ్ షిర్కే, కేకే నగర్ ప్రాంతాలు రామగిరి మండలం వెంకట్రావుపల్లి పరిధిలోకి, మంథని నియోజకవర్గంలోకి వస్తాయి. ఇక టి1, టి2, సీ2, ఎస్సీటు, ఎన్సీ, పోతనకాలనీ ప్రాంతాలు నగరపాలక సంస్థలోని 15, 16, 17, 18, 19 డివిజన్ల కింద, రామగుండం నియోజకవర్గ పరిధిలో ఉన్నాయి. దీంతో కాలనీలో రెండు నియోజకవర్గాల అభ్యర్థులు ప్రచారం చేస్తున్నారు. మంథని పరిధిలోని ప్రాంతాలను రామగుండంలో విలీనం చేయాలన్న డిమాండ్లు నెరవేరడం లేదు.

అభ్యర్థికో ఇనుప పెట్టె ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో ఎన్నికల నిర్వహణ సులభతరం కోసం నేడు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం)లు అందుబాటులోకి వచ్చాయి. 1952, 57 ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఒకొక్కరికి ఒక్కో ఇనుప పెట్టెను ఏర్పాటు చేసేవారు. 1962 నుంచి పోలింగ్ బూత్‌కు ఒక పెట్టెను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం శాసనసభ, లోక్‌సభ ఎన్నికల కోసం వీటి స్థానంలో సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు వినియోగిస్తున్నారు.

తెరపైకి కొత్త పార్టీలు

ఈ ఎన్నికల్లో ప్రధాన పార్టీలతో పాటు కొత్తగా ఏడు పార్టీల అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. రాష్ట్రంలో రిజిస్టరు చేసుకున్న కొన్ని పార్టీలు పలు స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని వివిధ నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థుల పార్టీల పేర్లు కొత్తగా ఉన్నాయి. యుగతులసి పార్టీ, విద్యార్థుల రాజకీయ పార్టీ, ఘన స్వరాజ్ పార్టీ, ధర్మ సమాజ్ పార్టీ, భారతీయ స్వదేశీ కాంగ్రెస్, సోషలిస్టు పార్టీ ఆఫ్ ఇండియా, జన శంఖారావం పార్టీలు తెరపైకి వచ్చాయి. ఇందులోని కొన్ని పార్టీలు మెజారిటీ నియోజకవర్గాల్లో బరిలో ఉన్నాయి. అభ్యర్థుల్లో ఎక్కువ మంది రాజకీయాలపై ఆసక్తి ఉన్న వారే కావడం గమనార్హం.

ఇలాగైతే ఎలాగబ్బా!ఎన్నికలకు పది రోజుల సమయమే ఉండటంతో అభ్యర్థుల ప్రచారం జోరందుకుంది. ఓవైపు పార్టీల ముఖ్య నేతల ఆధ్వర్యంలో సమావేశాలు, రోడ్డుషోలు నిర్వహిస్తుండగా, మరోవైపు అభ్యర్థులు ఇంటింటి ప్రచారాలు కొనసాగిస్తున్నారు. క్షేత్ర స్థాయి ప్రచారానికి వచ్చే వారికి నాయకులు డబ్బులు చెల్లిస్తున్నారు. అయితే పలు చోట్ల ప్రచారానికి ఎక్కువ సంఖ్యలో వస్తున్నారు. దీంతో వార్డు సభ్యులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు తలలు పట్టుకుంటున్నారు. 20 మంది ప్రచారానికి వెళ్లాల్సి ఉండగా 35 మందికి తగ్గకుండా పాల్గొనడంతో ఏమీ అనలేక తీసుకెళ్తున్నారు. డబ్బులు సరిపోక సొంతంగా జేబుల్లోంచి చెల్లించాల్సి వస్తోందని ఓ పార్టీ కౌన్సిలర్ వాపోయారు. వద్దంటే మొదటికే మోసం వచ్చే ప్రమాదముందని అంటున్నారు. ఇప్పుడు వాళ్లను దూరం పెడితే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ కొంప ముంచుతారనే భయంతో ఖర్చు భరిస్తున్నామంటున్నారు. ఇక ఒకే ప్రాంతానికి చెందిన వారు ఉదయం ఒక పార్టీ, సాయంత్రం ప్రచారంలో పాల్గొంటుండటం కొసమెరుపు.

## మీ ఓటు ఎవరైనా వేస్తే..

వికారాబాద్: టెండరు ఓటు గురించి ఎన్నికల నిర్వహణ నిబంధనలు-1961 చట్టంలోని సెక్షన్ 49పీలో వివరాలుంటాయి. కొన్ని సందర్భాల్లో.. ఒకరి ఓటును మరొకరు వేస్తారు. అనంతరం అసలైన వ్యక్తి పోలింగ్ కేంద్రానికి వస్తే టెండరు ఓటు తెరపైకి వస్తుంది.ఓటు కోల్పోయిన వ్యక్తికి.. టెండరు ఓటు అవకాశాన్ని కల్పించే అధికారం ప్రిసైడింగ్ అధికారి(పీవో) పరిధిలో ఉంటుంది. నిబంధనలు అనుసరించి.. బాధిత వ్యక్తిని పీవో ప్రశ్నిస్తారు. సరైన సమాధానాలొచ్చాయని నిర్ధారించుకున్నాక.. బాధితుడికి బ్యాలెట్ పేపరు ఇచ్చి ఓటు వేయించి భద్రపరుస్తారు.బ్యాలెట్ పేపరును రెండు రకాలుగా ఉపయోగిస్తారు. మొదటిది ఈవీఎంపై అంటించడం. టెండరు ఓటు విధానం రెండోది. ఒక్కో పోలింగ్ కేంద్రానికి 20 బ్యాలెట్ పత్రాలను మాత్రమే ఇస్తామని, అంతకుమించి టెండరు ఓట్లకు అవకాశం ఉత్పన్నమైతే.. సదరు పోలింగ్ కేంద్రంలో తిరిగి ఎన్నిక నిర్వహించాలి. దీన్నే ఛాలెంజ్ ఓటు అని కూడా అంటారు.

# ప్రచార కాలం.. యువతకు గాలం!

కొత్తగూడెం : మునుపటి ఎన్నికల మాదిరిగా ఇప్పుడు కార్యకర్తలు, అభిమానులు.. నేతల వెంట వచ్చే పరిస్థితి లేదు. పోలింగ్‌కు కొద్ది రోజుల ముందే ప్రధాన పండుగలు, పర్వదినాలు, వ్యవసాయ సీజన్లు రావడంతో అన్నివర్గాల వారు ఎవరి పనుల్లో వారు నిమగ్నమవుతున్నారు. దీంతో అభ్యర్థులు, నాయకులు తమ వెంట అనుచరులతో పాటు ఉత్సాహవంతులైన యువతను వెంటబెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. గతంలో మాదిరిగా గ్రామాలు, పట్టణాల్లోని యువకులు స్వచ్ఛందంగా పార్టీల కార్యక్రమాల్లో ఉత్సాహంగా కనిపించడం లేదు. ఈ లోటును భర్తీ చేసుకునేందుకు, యువత సైతం తమ వెంటే ఉందని ప్రత్యర్థులకు చాటాలనే ప్రయత్నంలో కొందరు విద్యార్థులకు గాలం వేస్తున్నారు. గత కొద్దిరోజులుగా డిగ్రీ, బీటెక్, తత్సమాన కోర్సులు అభ్యసిస్తున్న వారు, ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్న నిరుద్యోగులను ప్రచారాలకు తీసుకెళ్లే ప్రయత్నాలు కొనసాగి స్తున్నారు. 'ఈ నాలుగు రోజులు ప్రచారం జరిగే వరకు మీ అబ్బాయిని తీసుకెళ్తాం. పెట్రోలు, భోజనం ఖర్చులతో పాటు రోజుకు కొంత మొత్తం ఇప్పిస్తాం. ఆ డబ్బులు చదువుకైనా ఉపయోగపడతాయి. మందు, విందులు వంటివి ఎట్టి పరిస్థితుల్లో ఉండవు' అని స్థానిక నాయకులు యువత తల్లిదండ్రులకు నచ్చచెబుతున్నారు. వారి పిల్లలను పార్టీ కార్యక్రమాలకు తమ వెంట తీసుకెళ్తున్నారు.

చేతి ఖర్చుల కోసం...

పాల్వంచ, కొత్తగూడెం పట్టణాలతో పాటు సమీప గ్రామాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు ద్విచక్ర వాహన ర్యాలీలు, ప్రదర్శనలు, సమావేశాలు నిర్వహిస్తే స్థానిక హాస్టళ్లు, విద్యాలయాలకు వెళ్లి ఆసక్తి ఉన్నవారిని తరలిస్తున్నారు. రెండు పట్టణాల్లోని డిగ్రీ, ఇంజినీరింగ్, గురుకుల విద్యాలయాలు, వసతి గృహాల్లో 18 ఏళ్ల వయసు దాటినవారు సుమారు 5 వేల మంది ఉన్నారు. వీరిలో ద్విచక్ర వాహనాలు ఉన్నవారిని



నాయకులు తగిన సంఖ్యలో తమ ర్యాలీలు, ప్రచారాలకు తీసుకెళుతున్నారు. గంట నుంచి 2 గంటల్లోపు కార్యక్రమాలకైతే పెట్రోలుకు రూ.100, చేతిఖర్చుల కింద రూ.200 వరకు ఇస్తున్నారు. ఒకవేళ రోజంతా వెళ్లాల్సి వస్తే పెట్రోలు ధర రెట్టింపు చెల్లించడంతో రూ.300 వరకు నగదు ఇస్తున్నారు. మధ్యాహ్నం వేళ రూ.200 వరకు ఖర్చుచేసి భోజనం లేదా బిర్యానీ పెట్టిస్తున్నారు. 'ఎన్నికల వాతావరణం నేపథ్యంలో తరగతులకు నష్టం వాటిల్లకుండా, చేతి ఖర్చుల కోసం రెండు, మూడ్రోజులకోసారి ప్రచారానికి వెళ్తున్నాను' అని పాల్వంచకు చెందిన ఓ డిగ్రీ కళాశాల విద్యార్థి పేర్కొన్నారు. రాజకీయాలంటే ప్రత్యేకంగా ఆసక్తేమీ లేదని, ఇలా చేయడం తమ కుటుంబాలకూ నచ్చడం లేదని మరొకరు అభిప్రాయపడ్డారు.

పగలు ప్రచారం.. రాత్రి వ్యూహం

అభ్యర్థుల్లో కొందరు సాయంత్రం వరకు కార్యకర్తలతో వార్డులు, గ్రామాల్లో పార్టీ జెండాలతో ప్రచారం చేయిస్తూ నిశీధిలో తమ వ్యూహం అమలు చేస్తున్నారు. ఇప్పటికే పలు పార్టీల ముఖ్య నేతలు, సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులను తమ వైపునకు తిప్పుకొన్నారు. కుల సంఘాలు, ఉద్యోగులు, వివిధ వర్గాలతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి మద్దతు కోరుతున్నారు. విజయమే లక్ష్యంగా అభ్యర్థులు అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు కంటిపై కునుకు లేకుండా మంతనాలు జరుపుతున్నారు. వ్యవహారం బయటకు పొక్కకుండా ఉండేందుకు ఆయా నియోజకవర్గాల్లో కాకుండా బయట తోటలు, వేర్వేరు ప్రాంతాల్లో సమావేశాలు సైతం నిర్వహిస్తున్నారు.

# మన్నెం మనసులో ఏముందో..!

కొత్తగూడెం :భద్రాచలం మన్నెం మనస్సులో ఏముందో గానీ ఈసారి తమనే విజయం వరిస్తుందని ప్రధాన పార్టీల అభ్యర్థులు ఆశాభావంతో ఉన్నారు. ఐటీడీఏ పరిధిలోని నాలుగు జిల్లాల్లో గిరిజన ఓటర్ల తీర్పు కీలకం కానుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 23 మండలాలు ఉన్నాయి. ఇందులో కొంత మైదాన ప్రాంతం ఉన్నప్పటికీ, అన్ని మండలాలు ఐటీడీఏ పరిధిలోనివే. ఖమ్మం జిల్లాలో ఏన్కూరు, కామేపల్లి, సింగరేణి మండలాలు పూర్తిగా సత్తుపల్లి, పెనుబల్లి మండలాలు పాక్షికంగా మన్యంగా గుర్తింపు పొందాయి. మహబూబాబాద్ జిల్లాలో బయ్యారం, గార్ల, ములుగు జిల్లాలో వెంకటాపురం, వాజేడు మండలాలు ఏజెన్సీ జాబితాలోనివే. ఇలా 32 మండలాల్లో మొత్తం ఓటర్లలో దాదాపు 40 శాతం గిరిజనులు కావడం విశేషం. మిగతా వర్గాలతో పోలిస్తే ఇది పెద్ద సంఖ్య. కులాల వారీగా ఓటర్ల లెక్కపై స్పష్టత లేనప్పటికీ మన్యంలో గిరిజనాన్ని తక్కువ అంచనా వేయడం కుదరని పని. వలస ఆదివాసీలు వలస ఆదివాసీలను గొత్తికోయలుగా పిలుస్తారు. నాలుగు దశాబ్దాలుగా 30 వేల మందికి పైగా రకరకాల కారణాలతో ఛత్తీస్‌గఢ్ నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు వలస వచ్చారు. ఇందులో కుక్కునూరు, వేలేరుపాడు(ఏలూరు జిల్లా), కూనవరం, వరరామచంద్రాపురం, చింతూరు, ఎటపాక(అల్లూరి సీతారామరాజు జిల్లా)తో పాటు భద్రాద్రి, ఖమ్మం జిల్లాల్లోనూ నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. భద్రాద్రి జిల్లాలోని చర్లలోనే సుమారు 6 వేల మంది జీవిస్తున్నారు. పాల్వంచ, ములకలపల్లి, మణుగూరు, పినపాక, బూర్గంపాడు మండలాల్లోను వీరి ఆవాసాలు ఉన్నాయి. వీరికి కనీస మౌలిక సదుపాయాలు లేవు. హక్కుల కోసం పోరాడుతున్నారు. 10 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కలిపి సుమారు 10 వేల ఓట్లు ఉంటాయని అంచనా. మొత్తం మీద వీరి మనసును మెప్పించే నాయకులెవరో వేచి చూడాలి.ప్రసన్నం చేసుకునేదెవరు..?భద్రాచలం మన్యంలో కోయ, లంబాడి, ఎరుకల, కొండరెడ్డి, నాయకపోడు వంటి తెగల్లో ప్రభావితం చేసే స్థాయిలో ఓటర్లు ఉన్నారు. ఈ పరిస్థితుల్లో అందరి చూపు అరణ్యంలోని ఆదివాసీలపై పడింది. ఓటు శాతాన్ని పెంచేందుకు అధికారులు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. అభ్యర్థులు మారుమూలన ఉన్న ఆవాసాలను చుట్టేస్తూ ముమ్మర ప్రచారం సాగిస్తున్నారు.

## యూరియా ఉత్పత్తికి అంతరాయం

పెద్దపల్లి : రామగుండం ఎరువుల కర్మాగారంలో యూరియా ఉత్పత్తికి మరోసారి అంతరాయం ఏర్పడింది. ప్రణాళిక ప్రకారం మరమ్మతులు పూర్తయితే ఈ నెలాఖరు వరకు యూరియా ఉత్పత్తి జరిగే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. ఈ కారణంగా నవంబరు మాసంలో సుమారు పక్షం రోజుల యూరియా ఉత్పత్తిని కోల్పోవాల్సి వస్తోంది. తరచూ అమ్మోనియా పైపులైను లీకేజీలతో అత్యధిక సార్లు యూరియా ఉత్పత్తి నిలిపివేయాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు సుమారు 11 సార్లు యూరియా ఉత్పత్తికి అవరోధాలు ఏర్పడగా సుమారుగా 45 రోజుల పాటు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. ఇందులో అత్యధికంగా ఒక నెలలో 17 రోజుల పాటు యూరియా ఉత్పత్తికి అంతరాయాలు ఏర్పడగా అత్యల్పంగా ఒక రోజులో ఉత్పత్తి




పునరుద్ధరించిన సంఘటనలు ఉన్నాయి. కర్మాగారంలో ప్రతి నెల సుమారుగా 1,07,800 మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి లక్ష్యం కాగా ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్, మే, జూలై, ఆగస్టు నెలల్లో లక్ష్యానికి మించి యూరియా ఉత్పత్తి జరిగింది. ఆర్థిక సంవత్సరం ఆరంభంలో రికార్డు స్థాయిలో 1,18,805 మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి జరగగా అత్యల్పంగా జూన్‌లో కేవలం 22,501 మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే ఉత్పత్తి జరగడం గమనార్హం. కర్మాగారంలో ఎలాంటి అంతరాయాలు లేకుండా యూరియా ఉత్పత్తి జరిగితే 2023–24 ఆర్థిక సంవత్సరంలో మొదటి ఆరు నెలల్లో సుమారుగా రూ.300 కోట్లకు పైగా నికర లాభాలు ఆర్జించాల్సి ఉండగా వివిధ కారణాలతో ఉత్పత్తికి అవరోధాలు ఏర్పడటంతో కేవలం రూ.191 కోట్ల లాభాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

## వీరు 'కాకతీయ'లో ఎదిగారు..!

భూపాలపల్లి : ఉత్తర తెలంగాణలో ఉన్నత విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది కాకతీయ విశ్వవిద్యాలయం. ఎంతో మంది రాజకీయ నేతలను తయారు చేసింది. మేధావులకు నిలయంగా, వామపక్ష ఉద్యమాలకు కేంద్రంగా ఉమ్మడి రాష్ట్రంలో తన ఖ్యాతిని చాటుకుంది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ వ్యాప్తిలోనూ తన వంతు పాత్ర వహించింది. ఇక్కడ ఉద్యమాలు చేసి మేధావులుగా వెలుగొందిన ఎందరో నేతలను రాజకీయ పదవులు వరించాయి. కేయూ నుంచి రాజకీయ ప్రస్థానంలో నిలిచిన నేతలపై ప్రత్యేక కథనం. దివంగత ఆచార్యులు కె.జయశంకర్, బియ్యాల జనార్దన్‌రావు, మానవ హక్కుల ప్రాధాన్యాన్ని చాటిన ఆచార్య బుర్రా రాములు.. విశ్రాంత ఆచార్యులు కె.వెంకట నారాయణ, టి.పాపిరెడ్డి ఇక్కడి నుంచే తమ ప్రస్థానాన్ని ప్రారంభించారు. స్వరాష్ట్ర ఉద్యమంలో ఇక్కడి మేధావి, విద్యార్థి, పరిశోధక, అధ్యాపకుల పాత్ర చిరస్మరణీయంగా నిలిచింది. ఉద్యమం నుంచి పుట్టుకొచ్చిన పలువురికి రాష్ట్రం ఏర్పడ్డాక పదవులు వచ్చాయి.

పోరాటం నుంచి పదవి వరకు..

కాకతీయ విశ్వవిద్యాలయంలో పీజీ పూర్తి చేసిన సిరికొండ మధుసూదనాచారి ఎమ్మెల్యేగా, శాసనసభ స్పీకర్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు.

ఇక్కడ చదువుకున్న కడియం శ్రీహరి ఉపముఖ్యమంత్రిగా, మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం ఎమ్మెల్సీగా కొనసాగుతూ మరోసారి స్టేషన్ ఘన్‌పూర్ నుంచి బరిలో ఉన్నారు.

కేయూ వృక్షశాస్త్రంలో పీజీ పూర్తిచేసిన విశ్రాంత ఆచార్యులు ఎం.సీతారాంనాయక్ 2005 నుంచి 2008 వరకు కేయూ పాలకమండలి సభ్యుడిగా పనిచేశారు. ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. 2014లో తన అధ్యాపక వృత్తికి రాజీనామా చేసి భారాస సభ్యత్వాన్ని స్వీకరించారు. అదే ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థిగా మహబూబాబాద్ నుంచి బరిలో నిలిచి విజయాన్ని అందుకున్నారు. కేయూ నుంచి ఎంపీ అయిన మొదటి వ్యక్తిగా నిలిచారు.

వరంగల్‌కు చెందిన డా.బండా ప్రకాశ్ కేయూ ప్రభుత్వ పాలనా శాస్త్రంలో పీజీ పూర్తి చేశారు. డాక్టరేట్ అందుకున్నారు. మొదట్లో వామపక్ష విద్యార్థి ఉద్యమంలో పనిచేశారు. రాజకీయ ప్రస్థానం మాత్రం కాంగ్రెస్ నుంచి ప్రారంభమైంది. సుదీర్ఘ కాలం పనిచేసినప్పటికీ పదవులు రాలేదు. కేయూ ఏర్పాటు కోసం ఉద్యమించిన వారిలో ఈయన కూడా ఉన్నారు. కాంగ్రెస్ నుంచి భారాసలో చేరిన బండా



ప్రకాశ్ రాజ్యసభ సభ్యుడిగా గెలుపొందారు. అనంతరం ఎమ్మెల్సీగా గెలుపొంది రాష్ట్ర విధాన మండలి వైస్ ఛైర్మన్‌గా ప్రస్తుతం కొనసాగుతున్నారు. వాసుదేవరెడ్డి పాలనా శాస్త్రంలో పీజీ పూర్తి చేసుకున్న తర్వాత రాష్ట్ర సాధనలో పూర్తి స్థాయి కార్యకర్తగా పనిచేశారు. 2009 డిసెంబర్‌లో తెలంగాణ విద్యార్థి సంఘాలను సమీకరించి విద్యార్థి ఐకాసను ఏర్పాటు చేయడంలో కీలకంగా వ్యవహరించారు. ఐకాస అధ్యక్షుడిగా పనిచేశారు. ఇక్కడికి కేసీఆర్‌ను తీసుకొచ్చి భారీ బహిరంగ సభ నిర్వహించడంలో ముఖ్య పాత్రను పోషించారు. అప్పటి నుంచి కేసీఆర్ దృష్టిలో పడిన వాసుదేవరెడ్డి తెలంగాణ దివ్యాంగుల సంక్షేమ, సహకార కార్పొరేషన్ ఛైర్మన్‌గా రెండు సార్లు కొనసాగారు.

హనుమకొండకు చెందిన మర్రి యాదవరెడ్డి కేయూ ప్రభుత్వపాలనా శాస్త్రం నుంచి పీజీ పట్టా పుచ్చుకున్నారు. రాష్ట్ర సాధనలో ముందున్నారు. తెలంగాణ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్‌లో పలు పదవులు నిర్వహించారు. తెలంగాణ ఉద్యమం ప్రారంభం కాకముందు నుంచి ఈయన కేయూ వేదికగా పలు ఉద్యమాలు నిర్వహించారు. కుడా ఛైర్మన్ పదవిలో రెండు పర్యాయాలు పనిచేశారు.

# సమయంలేదు మిత్రమా..!




వికారాబాద్: శాసన సభ ఎన్నికల ప్రచారం ఈ నెల 28 సాయంత్రంతో ముగుస్తుంది. అంటే గట్టిగా పది రోజులు కూడా లేవు. దీంతో జిల్లాలోని ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారాన్ని ఉద్ధృతం చేశారు. ఓటరు ప్రసన్నానికి అన్ని విధాలా వ్యూహాలు పన్నుతున్నారు.

భారాస.. కాంగ్రెస్‌ల మధ్యే ప్రధాన పోటీ

జిల్లాలోని కొడంగల్, పరిగి, వికారాబాద్ నియోజక వర్గాల్లో ప్రధాన పోటీ భారాస – కాంగ్రెస్‌ల మధ్యే ఉండగా, కొన్ని చోట్ల భాజపా, బీఎస్పీ పార్టీలు తమవంతు పోటీ ఇవ్వడానికి యత్నిస్తున్నాయి. దీంతో రాజకీయం రోజురోజుకు వేడెక్కుతోంది. అగ్రనేతలను తీసుకొచ్చి సభలు నిర్వహించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నాయి.

ఉదయం ప్రచారం.. రాత్రి మంతనాలు: జిల్లాలోని ఏ నియోజకవర్గాన్ని తీసుకున్నా ప్రధాన పార్టీల అభ్యర్థులు ఉదయం పూట ప్రచారంలో తలమునకలై ఉంటున్నారు. రాత్రిపూట ముఖ్య నేతలతో అంతర్గత మంతనాలు జరుపుతున్నారు. రోజువారీ పరిణామాలను తెలుసుకొని అనుకూలమా, ప్రతికూలమా? అనే లెక్కలు వేస్తున్నారు. భారాస గ్రామీణ స్థాయిలో ప్రతి వందమందికీ ఒక కార్యకర్తను నియమించి ఓటర్లతో మంతనాలు జరుపుతుంటే, మిగతా పార్టీలు ఇంటింటికీ తిరిగి సంఘాలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాయి.

పరిగిలో ఆధిక్యం చాటేందుకు యత్నం

పరిగి నియోజకవర్గంలో భారాస– కాంగ్రెస్‌ల మధ్య పోటీ 'నువ్వా.. నేనా' అనే రీతిలో సాగుతోంది. భారాస అభ్యర్థి మహేష్‌రెడ్డి క్షేత్రస్థాయిలో ఇంటింటి ప్రచారంతో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డి గ్రామాల్లో పర్యటిస్తూ ఆరు గ్యారంటీలపై అర్థమయ్యే విధంగా వివరిస్తున్నారు. ఇరు పార్టీల్లోకి కొనసాగుతున్న వలసలు వారికి పైకి బలంగా కనిపించినా కొంత ఇబ్బందిగా మారే వాతావరణం లేకపోలేదు. వీరికి దీటుగా భాజపా అభ్యర్థి మారుతీకిరణ్, బీఎస్పీ అభ్యర్థి ఆనందంలు సైతం ప్రచారం నిర్వహిస్తున్నారు.

తాండూర్‌లో ప్రతిష్ఠాత్మకం

తాండూర్ నియోజకవర్గంలో భారాస– కాంగ్రెస్‌ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. భారాస అభ్యర్థి రోహిత్‌రెడ్డి తనదైన శైలిలో ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ఇందుకు దీటుగా కాస్తంత ఆలస్యంగా ఖరారు చేసుకున్న కాంగ్రెస్ అభ్యర్థి మనోహర్‌రెడ్డి పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఈ పార్టీలకు దీటుగా జనసేన అభ్యర్థి నేమూరి శంకర్‌గౌడ్, బీఎస్పీ అభ్యర్థి చంద్రశేఖర్‌లు ప్రచారంలో ముందంజ వేస్తున్నారు.

వికారాబాద్‌లో.. ఉదయంనుంచే గ్రామాల బాట

వికారాబాద్ నియోజకవర్గంలో భారాస– కాంగ్రెస్ పార్టీల మధ్య పోటీ 'గట్టి'గానే ఉంటోంది. రోజురోజుకూ సమీకరణలు అటు ఇటూ మారుతూ ప్రధాన పార్టీ అభ్యర్థుల్లో గుబులు రేపుతున్నాయి. భారాస అభ్యర్థి ఆనంద్, కాంగ్రెస్ అభ్యర్థి ప్రసాద్‌కుమార్‌లు ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి ఉదయం 7 గంటల నుంచే గ్రామాల బాట పడుతున్నారు. వృద్ధులు, మహిళలతో మాట్లాడుతూ, కూడళ్లలో సభలు నిర్వహిస్తున్నారు. భాజపా అభ్యర్థి నవీన్‌కుమార్, బీఎస్పీ అభ్యర్థి క్రాంతికుమార్‌లు సైతం ప్రధాన పార్టీలకు దీటుగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

కొడంగల్‌లో ఆసక్తికరం

ఈసారి తాండూరు, పరిగి, వికారాబాద్ ఒక ఎత్తు అయితే, కొడంగల్ ఒక్కటే మరో ఎత్తు. ఎందుకంటే భారాస అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డి విస్తృతంగా ప్రచారం చేస్తూ ఓట్ల వేట మొదలు పెట్టారు. మంత్రి మహేందర్‌రెడ్డి ఈయనకు అన్న కావడంతో గెలుపు బాధ్యత భుజాన వేసుకుని అక్కడే మకాం వేయడంతో పోటీ ఆసక్తికరంగా మారింది. ఇక స్వయాన టీపీసీసీ అధ్యక్షుడు, రేవంత్‌రెడ్డి ఈసారి కొడంగల్‌నుంచే బరిలో ఉండటంతో అందరి దృష్టి కొడంగల్‌పైనే పడింది. ఎత్తుకు పైఎత్తులు వేస్తూ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు. భాజపా అభ్యర్థి బంటు రమేష్, బీఎస్పీ నర్మదలు ఇంటింటి ప్రచారంతో జోరు పెంచారు.

# ఎన్నికల వనభోజనం..!



వికారాబాద్: ఏటా దీపావళి తర్వాత 'కార్తిక వనభోజనాల' పేరుతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించుకుని సంఘంలో తమ ఉనికి చాటుకోవడానికి అన్ని సామాజిక వర్గాలు పోటీ పడుతుంటాయి. ప్రస్తుతం ఆయా పార్టీల అభ్యర్థులు దీన్ని సువర్ణావకాశంగా భావిస్తున్నారు. తమ నియోజకవర్గాల్లో గెలుపోటములపై ప్రభావం చూపే కుల సంఘాల జాబితాలు సేకరించి సొంత ఖర్చులతో వనభోజనాలు నిర్వహిస్తామంటూ ప్రతినిధులను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నారు.

ఖర్చు మాది.. ఓట్లు మీవి..ఏటా కార్తిక మాసం మధ్య నుంచి చివరి వారంలో వనభోజనాల సందడి కొనసాగుతుంది. ఈసారి మాత్రం ఎన్నికలలోపే పూర్తిచేసేందుకు అటు నిర్వాహకులు.. ఇటు పార్టీల అభ్యర్థులు ఉవ్విల్లూరుతున్నారు. వన భోజనాలు ఏర్పాటు చేస్తే ఖర్చంతా తామే భరిస్తామని, హాజరయ్యే మహిళలు, వృద్ధులు, పిల్లలకు బహుమతులు సైతం అందిస్తామని అభ్యర్థులు హామీలు ఇస్తున్నారు. ఈ ఎన్నికల్లో సామాజిక వర్గం వారంతా తమకే ఓటేసేలా సభ్యులందరికీ మౌఖికంగా సూచనలు చేయాలని ప్రతినిధులను కోరుతున్నారు. వనభోజనాల నిర్వహణకు ఒక్కో సామాజిక వర్గానికి ఒక్కో ప్రత్యేక బృందాన్ని కేటాయిస్తున్నారు. కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన ఫంక్షన్‌హాళ్లు, ఇతరత్రా ఏర్పాట్లన్నీ సదరు బృందం సభ్యులే చూస్తారు.

మచ్చుకు కొన్ని..

మేడ్చల్ నుంచి బరిలోకి దిగిన అభ్యర్థి ఒకరు వనభోజనాల నిర్వహణకు ఇప్పటికే రెండు రిసార్ట్‌లతోపాటు నాలుగు ఫాంహౌస్‌లను తన నియోజకవర్గం పరిధిలోనే బుక్ చేయించారు.

కూకట్‌పల్లిలోని ఓ అభ్యర్థి రెండు ప్రధాన సామాజిక వర్గాలపై గురిపెట్టారు. పక్కనే ఉన్న శేరిలింగంపల్లి పరిధిలోని మూడు కన్వెన్షన్ కేంద్రాల్లో ఏర్పాట్లు చేయిస్తున్నారు.

కుత్బుల్లాపూర్‌కు చెందిన రెండు ప్రధాన పార్టీల అభ్యర్థులు సైతం ఇప్పటికే ఫంక్షన్‌హాళ్లను బుక్ చేయించారు. మరో అభ్యర్థి కూడా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

పటాన్‌చెరు నుంచి బరిలోకి దిగిన ఓ బడా వ్యక్తి సంగారెడ్డి వద్ద ఉన్న రెండు ఫంక్షన్‌హాళ్లను పక్షం రోజుల పాటు అద్దెకు తీసుకున్నారు.

శేరిలింగంపల్లికి చెందిన ఇద్దరు అభ్యర్థుల్లో ఒకరు కుత్బుల్లాపూర్ పరిధిలో.. ఇంకొకరు పటాన్‌చెరు పరిధిలో ఫంక్షన్‌హాళ్లు బుకింగ్ చేసుకున్నారు.

మల్కాజిగిరి నుంచి బరిలో నిలిచిన ఇద్దరుబడా అభ్యర్థులు పోటాపోటీగా ప్రయత్నాలు చేస్తున్నారు. సామాజిక వర్గాలతో చర్చలు జరుపుతున్నారు.ఆ ఖర్చులోకి రాదనే..కుల సంఘాల వనభోజనాలు ప్రైవేటు కార్యక్రమాల కిందకు వస్తాయి. ఖర్చు అభ్యర్థులదే అయినా అధికారికంగా నిరూపితం కాదు. ఎన్నికల నియమావళి పరిధిలోకి రాదు. అభ్యర్థులు హాజరు కాకపోయినా.. నిర్వాహకులు ఫలానా అభ్యర్థి ఈ ఖర్చంతా పెట్టుకున్నాడు.. ఆయనకు మద్దతు పలికితే చాలు అనేలా సభ్యులకు మౌఖిక ప్రచారం చేసేలా కొందరు వ్యూహరచన చేస్తున్నట్లు తెలుస్తుంది.

## సీసీ కెమెరాల ఆధారంగా విద్యార్థిని ఆచూకీ

వికారాబాద్: అదృశ్యమైన విద్యార్థిని పోలీసులు నిఘానేత్రాల ఆధారంగా గుర్తించారు. జూబ్లీహిల్స్ ఠాణా పరిధిలోని జరిగిన సంఘటన వివరాల్లోకి వెళితే.. వెంకటగిరి ప్రాంతానికి చెందిన పదో తరగతి విద్యార్థిని(15) తల్లి అయిదు నెలల క్రితం చనిపోయింది. అప్పటి నుంచి పాఠశాలకు సరిగా వెళ్లకపోవడంతో సోదరుడు మందలించాడు. దీంతో ఈనెల 10న ఆమె ఇంటి నుంచి అదృశ్యమైంది. తండ్రి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విద్యార్థిని వద్ద చరవాణి లేదు. స్నేహితుల ఇళ్లకు వెళ్లలేదు. దీంతో కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో నిఘానేత్రాల నిర్వహణ చూస్తున్న హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వర్‌రావు వెంకటగిరి, కృష్ణనగర్, యూసుఫ్‌గూడ, అమీర్‌పేట ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించి ఆటో ఎక్కినట్లు గుర్తించారు. అమీర్‌పేట, బేగంపేట వైపు కెమెరాలను పరిశీలించి ఆటో నంబరు గుర్తించారు. అక్కడి నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లి ఓ వ్యక్తితో మాట్లాడుతున్నట్లు తెలుసుకున్నారు. మార్కెట్, మహంకాళి




ప్రాంతాల్లో ఉన్న నిఘానేత్రాల్లో అతడితో ద్విచక్రవాహనంపై ఓ పెట్రోల్ బంక్‌లోకి వెళ్లినట్లు ఉండటంతో వాహనం నంబరు ఆధారంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వద్ద అదుపులోకి తీసుకొన్నారు. విచారించగా.. ఆమె ఎవరో తనకు తెలియదని, చనిపోవడానికి అంటూ ఏడుస్తుంటే బుజ్జగించినట్లు తెలిపాడు. దీంతో విద్యార్థిని గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## పల్లెలే ఆదర్శంగా.. ఓటెత్తాలి!

భూపాలపల్లి : భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థ సరిగా ముందుకు కదలాలంటే రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి.. అప్పుడే దేశ భవిష్యత్తును చక్కగా తీర్చిదిద్దుకోగల్గుతాం. అయితే ఓటు వేయడంలో చాలా మంది నిర్లక్ష్యం కనబరుస్తున్నారు. మరీ ముఖ్యంగా.. గ్రామాలతో పోలిస్తే పట్టణాల్లోనే తక్కువ పోలింగ్ నమోదవుతోంది. ఓ వైపు ఎన్నికల అధికారులు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా.. పలు కేంద్రాల్లో పోలింగ్ శాతం తక్కువ కావడం ఆందోళనకర విషయం.. భావితరాలను దృష్టిలో పెట్టుకుని ఒక మంచి నాయకుడిని ఎన్నుకోవాలనుకుంటే.. మనంతట మనమే ఓటు వినియోగానికి కదలాలి. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో 90 శాతానికి పైగా పోలింగ్ నమోదైన కేంద్రాల ఓటర్లను ఆదర్శంగా తీసుకోవాలి.

ఈ చిత్రంలో కనిపిస్తున్న పోలింగ్ కేంద్రం నంబర్ 172.. టేకుమట్ల మండలం రాఘవరెడ్డిపేట పంచాయతీ పరిధిలోనిది.. ఇక్కడ 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 98.30 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం ఓటర్లు 470 ఉండగా 462 మంది ఓటు వినియోగించుకున్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ కదలాల్సిన అవసరం ఉంది.

రేగొండ మండలం లింగాల గ్రామ పంచాయతీ పరిధిలోని పోలింగ్ కేంద్రం(నం.228) ఇది.. పోలింగ్ కేంద్రంలో 522 మంది ఓటర్లు ఉండగా 503 మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో 96.36 శాతం పోలింగ్ నమోదైంది.

ఇది చిట్యాల మండలం కాల్వపల్లి పంచాయతీ పరిధిలోని పోలింగ్



కేంద్రం(నం.8).. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇందులో 94.96 శాతం పోలింగ్ నమోదైంది. 393 మంది ఓటర్లు ఉండగా 375 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టణ ప్రాంత ఓటర్లు వీరిని ఆదర్శంగా తీసుకొని ఓటు హక్కు వినియోగానికి ముందుకు కదలాల్సి ఉంది.

64 కేంద్రాల్లో 90 శాతానికి పైగా..

2018 సంవత్సరంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భూపాలపల్లి నియోజకవర్గంలో 299 పోలింగ్ కేంద్రాల్లో 2,53,442 మంది ఓటర్లకు 2,08,142 మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈ లెక్కన 82.13 శాతం పోలింగ్ నమోదైంది. అందులో 90 శాతానికి పైగా పోలింగ్ జరిగిన కేంద్రాలు 64 ఉన్నాయి. ఇలాంటి పోలింగ్ కేంద్రాలను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు కదలాల్సిన అవసరం ఉంది. భూపాలపల్లి పట్టణంలోని ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తుండటంతో అక్కడ తక్కువ శాతం పోలింగ్ నమోదవుతోంది. మారుమూల గ్రామాల్లో నిరక్షరాస్యత ఎక్కువగా ఉంటుంది. అయినా ఓటు హక్కు వినియోగించుకోవడంలో ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. పట్టణ ప్రాంతంలో ఓటు హక్కు వినియోగించుకోవడంలో యువతే నిర్లక్ష్యం వహిస్తున్నారని అధికారులు తెలుపుతున్నారు. ఓటు వినియోగించుకుని మంచి నాయకుడిని ఎన్నుకుంటే యువతకే ఎక్కువ లాభం ఉండే అవకాశం ఉంటుంది.

## మద్యం, గంజాయి రవాణాకు చెక్..!

సూర్యాపేట : ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చాక జిల్లాలో మద్యం, గంజాయి అక్రమ రవాణా దాదాపుగా నిలిచిపోయింది. అసెంబ్లీ ఎన్నికల కోడ్ అక్టోబరు 9 నుంచి అమల్లోకి రావడంతో పోలీసులు సరిహద్దుల్లో నిఘా కట్టుదిట్టం చేసిన విషయం విదితమే. చెక్‌పోస్టుల్లో వాహనాలను తనిఖీ చేస్తుండటంతో పెద్ద ఎత్తున మత్తు పదార్థాల రవాణాకు అడ్డుకట్ట పడింది. గతంలో ఏవోబీ (ఆంధ్ర, ఒడిసా సరిహద్దు) నుంచి హైదరాబాద్, ముంబయి నగరాలకు గంజాయి రవాణా జరిగేది. కోడ్ అమల్లోకి రాకముందు కేవలం రాష్ట్రాల సరిహద్దుల్లోనే చెక్‌పోస్టులు ఉండటంతో ఏదో ఒక విధంగా సరకు దాటేసేవారు. ప్రస్తుతం జిల్లా సరిహద్దులతోపాటు ఆకస్మికంగా



చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. దీంతో పోలీసుల కళ్లుగప్పడం అక్రమార్కులకు సాధ్యం కావడం లేదు. ఇటీవల ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో తరలిస్తున్న గంజాయిని కోదాడ గ్రామీణ పోలీసులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే.

మూతపడిన గొలుసు దుకాణాలు

జిల్లా వ్యాప్తంగా ఉన్న మద్యం గొలుసు దుకాణాలు మూతపడుతున్నాయి. జిల్లాలో మూడు వేలకుపైగా బెల్టు దుకాణాలు ఉన్నాయి. పల్లెలోని గొలుసు దుకాణాలపై ఎక్సైజ్, పోలీసు శాఖలు సంయుక్తంగా దాడులు చేపడుతున్నారు. ఇప్పటి వరకు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలోనే 568 గొలుసు దుకాణాలపై కేసులు నమోదు చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో పట్టణ పోలీసులు 28 మద్యం గొలుసు దుకాణాలపై కేసులు నమోదు చేశారు. మరోవైపు సూర్యాపేట జిల్లాలోని కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాల నుంచి ఆంధ్రకు మద్యం సరఫరా సైతం నిలిచిపోయింది. మద్యం దుకాణాల యజమానులు బెల్ట్‌షాప్‌లకు మద్యం సరఫరాను నిలిపివేశారు.

# రంగు పడేనా.. తుప్పు వదిలేనా..?

చర్ల : తెలుగు రాష్ట్రాల్లో అత్యంత క్యాచ్‌మెంట్ ఏరియా ఉన్న మధ్యతరహా ప్రాజెక్టుల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు ఒకటి. ఎగువ ఛత్తీసగఢ్ నుంచి వచ్చే వరద నీటితో ఈ జలాశయం ఇట్టే నిండుకుండలా మారి ఆయకట్టుకు పుష్కలంగా సాగునీటిని అందిస్తోంది. రైతుల పాలిట కల్పవృక్షంలా ఉన్న ఈ జలాశయంపై ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ప్రాజెక్టు ప్రారంభం అనంతరం దశాబ్దాల తర్వాత 2006లో ఒకసారి మాత్రమే దీనికి రంగులు వేశారు. ప్రతి మూడేళ్లకు ఓసారి రంగులు వేయాల్సి ఉండగా ఈ ప్రాజెక్టుకు గత 17 ఏళ్లుగా ఆ ఊసే లేదు. దీంతో ఎక్కడికక్కడ ఇనుప సామాగ్రి తుప్పు పడుతోంది. ఇలాగే వదిలేస్తే ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితి.



ఈ ఏడాదైనా ప్రాజెక్టుకు రంగులు వేస్తారా రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రాజెక్టు గేట్లు ఎత్తడంలో కీలకమైన హయస్టు వంతెన పూర్తిస్థాయిలో తుప్పుపడుతోంది. దానిపై ఫుట్ బ్రిడ్జి ఐరన్ ప్లేట్లు దెబ్బతిని ప్రమాదకంగా మారుతున్నాయి. ఎప్పుడూ నీటిలో ఉండే క్రస్ట్ గేట్లూ తుప్పు పడుతున్నాయి. గేర్‌బాక్సులు, గేట్లు ఎత్తే యంత్రాలదీ ఇదే పరిస్థితి. రంగుల వేయించేందుకు రూ. 2.17 కోట్ల మేర నిధులివ్వాలని అధికారులు పలుమార్లు ప్రతిపాదనలు పంపినా ఫలితం ఇంకా దక్కని పరిస్థితి. ప్రాజెక్టుకు రంగుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, ఇటీవల ఓ అండ్ ఎం అధికారులు సందర్శించి పూర్తిస్థాయిలో పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారని, నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామని డీఈ తిరుపతి తెలిపారు.

# పెరిగిన హోదా.. సేవలు మెరుగుపడేనా!

జగిత్యాల : పేదలకు మెరుగైన వైద్యం అందించే ధర్మపురి ఆస్పత్రికి సమస్యల సుస్తీ చేసింది. పెద్ద ఆసుపత్రిగా హోదా పెరుగుతున్నా.. ఇక్కడికి వచ్చే వారు అసౌకర్యాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పూర్తిస్థాయి వైద్య సిబ్బంది సహా సరైన వైద్య పరికరాలు, యంత్రాలు లేకపోవడం ప్రతిబంధకంగా మారుతోంది. నెలకు ఐదారువేల మంది ఇక్కడికి పరీక్షల నిమిత్తం వస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయలను అందించే దిశగా కృషి చేస్తుంది. ధర్మపురి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 8 పడకలతో ప్రారంభమై ప్రస్తుతం 30 పడకల ఆసుపత్రి స్థాయికి చేరింది. ఇటీవలే వైద్య ఆరోగ్య శాఖ నుంచి వైద్య విధాన పరిషత్‌కు బదలాయించగా సామాజిక ఆరోగ్య కేంద్రంగా మారి ఇప్పుడిప్పుడే జిల్లా స్థాయి ఆసుపత్రిగా రూపుదిద్దుకుంటోంది. ఈ ఆసుపత్రిలో ఎనిమిది మంది వైద్యులు సేవలందిస్తున్నారు. గైనకాలజిస్ట్, ఆర్థోపెడిక్, జనరల్ సర్జన్, పీడియాట్రిక్, అనస్తీషియా, పల్మనాలజిస్ట్ తదితర విభాగాల్లో ప్రతి రోజు 150 మంది ఓపీ, సుమారు 20 మంది వరకు ఇన్‌పేషెంట్లకు సేవలు అందిస్తున్నారు. నిత్యం 50 మంది నుంచి రక్త నమూనాలను సేకరించి వివిధ రకాల పరీక్షల కోసం జగిత్యాలకు తరలిస్తున్నారు.

**వైద్యులంతా డిప్యుటేషన్‌పైనే...**

ప్రస్తుతం ధర్మపురి ఆసుపత్రిలో సేవలందిస్తున్న వైద్యులందరూ డిప్యుటేషన్‌పై విధుల్లో ఉన్నవారే. మొన్నటి వరకు పీహెచ్‌సీ పరిధిలో ఉండగా ఇద్దరు వైద్యులు మాత్రమే పూర్తిస్థాయి సేవలందించారు. గత ఏడాదిన్నర క్రితం ఈ ఆసుపత్రి వైద్య విధాన పరిషత్‌కు మారడంతో జగిత్యాల ప్రధాన వైద్యశాలలో ఉన్నవారిని తాత్కాలిక ప్రాతిపదికన



నియమించారు. పూర్తిస్థాయి సిబ్బంది నియామకం చేపట్టకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు అంటున్నారు. శాశ్వత ప్రాతిపదికన సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు.

బకాయిలు చెల్లించలేదని ఆసుపత్రిలో అంతర్జాల సౌకర్యాన్ని తొలగించారు. దీంతో తమ ఫోన్‌లో హాట్‌స్పాట్ ద్వారా సమాచారాన్ని అంతర్జాలంలో పొందుపరుస్తున్నామని సిబ్బంది చెబుతున్నారు.

**ఇబ్బంది లేకుండా చూస్తున్నాం**

ఆసుపత్రిలో రోజూ 150 మందికి ఓపీ సేవలను అందిస్తున్నాం. ప్రస్తుతం ఉన్న సిబ్బంది ద్వారా ప్రజలకు వైద్య సదుపాయాలలో ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. శాశ్వత ప్రాతిపదికన సిబ్బందిని నియమిస్తే మరింత మెరుగైన వైద్య సేవలను అందించడానికి అవకాశం ఉంటుంది.

నవీన్, ఆసుపత్రి సూపరింటెండెంట్

**పరికరాలు లేక ఇక్కట్లు**

నాకు జ్వరం రావడంతో నాలుగు రోజులుగా ఆసుపత్రిలో ఉంటున్నా. డాక్టర్లు బాగానే చూస్తున్నారు. ఎక్స్‌రే, రక్త పరీక్షలకు సంబంధించి పరికరాలు లేకపోవడం ఇబ్బందిగా మారింది. అధికారులు వైద్య సదుపాయానికి సంబంధించిన పరికరాలను సమకూర్చాలి. బి.లక్ష్మి

# అడవి బిడ్డల కష్టాలు తీరేనా..?




భద్రాచలం : భద్రాచలం ఐటీడీఏ పరిధిలో 32 మండలాలు ఉండటం ప్రత్యేకతను సంతరించుకుంది. భద్రాద్రి జిల్లాలోని 23 మండలాలే కాకుండా ములుగు జిల్లా (వాజేడు, వెంకటాపురం), మహబూబాబాద్ జిల్లా (గార్ల, బయ్యారం), ఖమ్మం జిల్లా (కామేపల్లి, కారేపల్లి, ఏన్కూరు మండలాలు పూర్తిగాను, సత్తుపల్లి, పెనుబల్లి మండలాలు పాక్షికంగా)లో ఐటీడీఏ పరిధిలోకి వస్తాయి. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వంటి వారు గిరిజనులతో మమేకమవుతున్నారు. ఆచార, సంప్రదాయాలు తెలుసుకుని అడవి బిడ్డల కష్టాలు వింటున్నారు. ఈపరిస్థితుల్లో పీఓలు కార్యాలయానికి పరిమితం కాకుండా అన్ని మండలాలను సందర్శించాల్సి వస్తోంది. ప్రాజెక్ట్ అధికారులుగా విధులు నిర్వర్తించే ఐఏఎస్‌లు దీన్ని భారంగా భావించనప్పటికీ నాలుగు జిల్లాల్లో క్షేత్ర పర్యటనలు చేయటం ఆషామాషీ కాదని విశ్లేషకులు చెబుతున్నారు. పైగా ప్రతి దర్బారులో పీఓ ఉండాలి.

**ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని వేడుకోలు**

తెలంగాణ రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. పాలనా ఫలాలు అట్టడుగున ఉన్నవారికీ అందాలనే లక్ష్యంతో రాష్ట్రంలోని పది జిల్లాలను 33 జిల్లాలుగా మార్చారు. గ్రామపంచాయతీల సంఖ్య పెరిగింది. మండలాలను విభజించారు. ఐటీడీఏల విభజన అంశం కేంద్రం పరిధిలో ఉండటంతో దీని జోలికి ఎవరూ పోవడం లేదు. సంబంధిత ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చొరవ చూపాలని గిరిజనులు కోరుతున్నారు. జడ్పీ సమావేశాలపై ఉన్న ఆసక్తిని ఐటీడీఏ సమీక్షలపైనా కనబరచాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**ఐటీడీఏని విభజిస్తే..**

రాష్ట్రంలో భద్రాచలం, మన్ననూరు, ఉట్నూరు, ఏటూరు నాగారం ఐటీడీఏలు గిరిజనులకు సేవలందిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా గిరిజనులు 31.77 లక్షల మంది నివసిస్తుండగా భద్రాద్రి జిల్లాలో 3.53 లక్షల మంది గిరిజనులున్నారు. నాలుగు జిల్లాలను పరిగణనలోకి తీసుకుంటే గిరిజనుల శాతం పెరుగుతుంది. ఇంతమందిపై ఐటీడీఏ ప్రత్యేక శ్రద్ధ చూపాలి. సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి. రెండు దశాబ్దాల చరిత్ర కలిగిన గిరిజన బీఈడీ కళాశాలకు ప్రిన్సిపల్ పోస్టును రెగ్యులర్ పద్ధతిలో భర్తీ చేయడం లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పలు కీలక హోదాలు ఇన్‌ఛార్జిలతో కొనసాగుతున్నాయి.

ములుగు జిల్లాలో కలిసిన వెంకటాపురం గిరిజనులు ఐటీడీఏ పథకాలకు భద్రాచలం రావాలంటే అవస్థలు పడుతున్నారు. అక్కడి అధికారుల ద్వారా దరఖాస్తు చేసుకుంటున్నారు. కొన్ని పథకాలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రాతిపదికనే మంజూరవుతున్నాయి. ఈనేపథ్యంలో 32 మండలాల పరిధి వల్ల ఒనగూరే ప్రయోజనం ఏంటన్నది అంతుచిక్కడం లేదు. కొవిడ్ ఉద్ధృతి, గోదావరి వరదల తరుణంలో వివిధ ఆదివాసీ ఆవాస ప్రాంతాలు దెబ్బతిన్నాయి. బాధితులను ఉన్నతాధికారులు సకాలంలో పరామర్శించలేదన్న ఆరోపణలున్నాయి. ఏజెన్సీ మండలాలు తక్కువ కలిగిన జిల్లాలో మినీ ఐటీడీఏలను ఏర్పాటు చేయవచ్చుననే ప్రతిపాదనలు ఉన్నప్పటికీ కార్యరూపం దాల్చటం లేదు. ఐటీడీఏల విభజన అసాధ్యమనుకుంటే ఆ స్థాయిలో నిధులు ఉండేలా పర్యవేక్షణ సాగాలని కోరుతున్నారు.

# మానవ వ్యర్థాలతో సేంద్రియ ఎరువు



జగిత్యాల : పట్టణాన్ని స్వచ్ఛత దిశగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం విభిన్న కార్యక్రమాలు చేపడుతోంది. ఇందులో భాగంగా మానవ వ్యర్థాలను పునర్ వినియోగించేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తుంది. నర్సింగాపూర్ శివారులో 01-04-22న మానవ వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రాన్ని ప్రారంభించారు. రూ. 3 కోట్ల ప్రభుత్వ నిధులతో ఎకరం స్థలంలో చేపట్టిన ఆధునిక కేంద్రంలో వ్యర్థాలను శుద్ధిచేసి ఎరువుగా మార్చి దానిని మొక్కలకు, రహదారుల వెంట చెట్లకు, వ్యవసాయ అవసరాలకు వినియోగిస్తున్నారు. ప్రిస్టిన్ భారత్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆధునిక సాంకేతికత ఆధారంగా ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. 35 కేఎల్‌డీ సామర్థ్యం కలిగిన కేంద్రంలో 3 వేల లీటర్ల మేరకు వ్యర్థాలను ఒకే రోజు శుద్ధి చేయవచ్చు. 95 శాతం నీరు, 5 శాతం వ్యర్థాలను సేంద్రియ ఎరువుగా మార్చుతున్నారు. సౌరశక్తితో వ్యర్థాలకు రక్షణ కల్పించి నిల్వ చేస్తున్నారు. జగిత్యాలలో ప్రతి నెల మానవ వ్యర్థాలను శుద్ధి చేయడం ద్వారా 7 టన్నుల సేంద్రియ ఎరువు తయారవుతుంది. పట్టణంలో 25 వేల కుటుంబాలు ఉన్నాయి. 1.20 లక్షల జనాభా ఉంది. ఇందుకనుగుణంగా 5 సెప్టిక్ ట్యాంక్ వాహనాలకు బల్దియా అనుమతినిచ్చింది. ప్రతి మూడేళ్లకొకసారి ట్యాంకు నిండినా నిండకపోయినా అందులోని వ్యర్థాలను విధిగా యజమానులు తొలగించుకోవాలనే నిబంధన ఉంది. ఈ మేరకు బల్దియా చెత్త సేకరణ వాహనాల్లో మైకుల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తోంది. గతంలో సెప్టిక్ ట్యాంకుల నుంచి తొలగించిన వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడేయడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారేవి. నూతనంగా నిర్మించిన శుద్ధీకరణ కేంద్రంతో పరిసరాలు శుభ్రంగా మారుతున్నాయి.

**శుభ్రత కోసం టోల్‌ఫ్రీ నంబర్**

పట్టణంలో సెప్టింక్ ట్యాంకు శుభ్రం చేయించుకోవాలనుకునే వారి కోసం మున్సిపాలిటీ ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్ 14420 కేటాయించింది. ట్యాంకు నిండిన వారు ఈ నంబర్‌కు ఫోన్ చేస్తే బల్దియా సిబ్బంది వాహనాల సమాచారం ఇస్తారు. రూ. 3వేల నుంచి రూ. 5వేల వరకు ఛార్జీ చెల్లిస్తే సిబ్బంది ట్యాంకు శుభ్రం చేస్తారు.

ప్రయోజనాలు.. శుద్ధీకరణ కేంద్రంలో తయారైన ఎరువుతో ప్రధాన రహదారులలోని చెట్లు, మొక్కలు పచ్చదనం సంతరించుకున్నాయి. హరిత హారం, పల్లె ప్రకృతి వనం, నర్సరీలకు, కేంద్రం ఆవరణలో ఉన్న చెట్లకు శుద్ధిచేసిన నీటిని, ఎరువులను వినియోగించడం ద్వారా చుట్టు పక్కల పరిసరాల్లో ప్రకృతి పచ్చదనం సంతరించుకుంది. సెప్టిక్ ట్యాంకు నిండినప్పుడు దుర్వాసన, దోమలు వ్యాప్తి చెందుతాయి. ఫలితంగా పలు జబ్బుల బారిన పడే అవకాశం ఉంది. ప్రతి మూడేళ్లకు ఒకసారి తప్పనిసరిగా సెప్టిక్ ట్యాంకును శుభ్రపరచుకోవాలి. ఈ మేరకు ప్రజా ప్రతినిధులు, అధికారులు అన్ని వార్డుల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి.


# అందుబాటులోకి వచ్చేదెప్పుడు?

జగిత్యాల : గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు అలంకార ప్రాయంగా మారాయి. గ్రామీణ ప్రాంతాల్లోని యువతను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావించింది. ఇందుకు అనుగుణంగా ప్రతి గ్రామంలో రూ. 2.20 లక్షలతో ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టారు. జిల్లాలో 380 పంచాయతీలలో వాటిని ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టగా ఇందులో 367 గ్రామాల్లో పూర్తి చేసినట్లు నివేదికల్లో వెల్లడించినా, ఎక్కడ చూసిన వాటి వినియోగం కనిపించడం లేదు. కొన్ని గ్రామాల్లో ఉన్నతాధికారుల ఒత్తిడి మేరకు స్థలాభావంతో పాటు గ్రామాలకు దూరంగా ఉండడం, సరైన వసతులు లేకపోవడంతో బోర్డులు పెట్టి వదిలేయగా మరిన్ని గ్రామాల్లో పరికరాలను పక్కనే పడేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాటు..

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న క్రీడా ప్రాంగణాల్లో వసతులు కల్పించడం సాధ్యమయ్యేలా కనిపించడంలేదు. అధికారులు ముందుగా ఎంపిక చేసిన స్థలాన్ని చదును చేసి వాటిల్లో కబడ్డీ, వాలీబాల్ కోర్టులతోపాటు లాంగ్‌జంప్, వ్యాయామం చేసేందుకు ఒకటి, రెండు వరుసల లైన్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. స్థల సమస్య ఉన్న పంచాయతీల్లో ప్రత్యామ్నాయ పద్ధతుల్లో క్రీడా మైదానాల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. గ్రామాలకు దూరంగా ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వాటిని ఏర్పాటు చేశారు. ధాన్యం ఆరబెట్టుకునేందుకు పూర్తి స్థాయిలో స్థలం లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతుండగా క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేయడంతో మరింత ఇబ్బందిగా మారింది.

**వసతులు కల్పించడం సాధ్యమేనా?**

అనేక గ్రామాల్లో ప్రస్తుతం కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రా



ల్లోనే క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయగా మరిన్ని గ్రామాల్లో బోర్డులు పెట్టి వదిలేశారు. అంతేకాకుండా ప్రాంగణాల చుట్టూ మొక్కలు(బయో ఫెన్సింగ్) నాటి కలుపు తీయాల్సి ఉంటుంది. కానీ ఎక్కడా వాటిని ఇప్పటి వరకు నాటినట్లు కనిపించడంలేదు. జిల్లా వ్యాప్తంగా 366 గ్రామాల్లో వ్యాయామం చేసే వరుసలు, 261 గ్రామాల్లో లాంగ్‌జంప్ కోర్టులు, 368 ప్రాంతాల్లో వాలీబాల్, 356 గ్రామాల్లో కబడ్డీ, 318 గ్రామాల్లో ఖోఖో కోర్టులు ఏర్పాటు చేసినట్లు చూపించారు. అంతేకాకుండా 336 గ్రామాల్లో క్రీడాప్రాంగణాల బోర్డులు, 350 గ్రామాల్లో ఒకే చోట ఆట స్థలం ఏర్పాటు చేసి పరికరాలు అమర్చినట్లు, 77 ప్రాంతాల్లో మొక్కలను నాటినట్లు 363 గ్రామాల్లో కలుపు మొక్కలు తొలగించినట్లు నివేదికల్లో కనిపిస్తుంది. వీటన్నింటితోపాటు 367 గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు వినియోగంలో ఉన్నట్లు చూపడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఇప్పటికైనా అధికారులు వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని క్రీడాభిమానులు కోరుతున్నారు.

# నగరాభివృద్ధికి పరుగులు

కరీంనగర్ : పెండింగ్ పనులతో పాటు కొత్తగా చేపట్టే అభివృద్ధి పనులకు ఎట్టకేలకు ప్రభుత్వం నుంచి అనుమతి లభించింది. కరీంనగర్ నగరపాలక సంస్థకు ముఖ్యమంత్రి హామీ నిధులు గతంలో మంజూరు చేయడంతో కనీస సౌకర్యాలు మెరుగుపర్చుకోవడానికి వీలు కలిగింది. ఆరేళ్ల కిందట మొత్తం మూడు విడతలుగా రూ. 347.23 కోట్లు నగరానికి నిధులు మంజూరయ్యాయి. మొదటి విడత మార్చి 2017లో రూ. 100 కోట్లు, రెండోవిడత డిసెంబర్ 2017లో రూ. 147.23 కోట్లు, సెప్టెంబర్ 2018లో మూడో విడతలో రూ. 100 కోట్లు కేటాయించారు. ఆ సమయంలో ఏ డివిజన్‌లో అడుగులేసినా అభివృద్ధి పనుల జోరు కనిపించింది. అదే తరహాలో ప్రస్తుతం అన్ని డివిజన్‌లలో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి పైపులైన్ల విస్తరణ వంటి పనులు చేసుకునే వీలు కలగనుంది.

**ప్రతీ డివిజన్‌కు నిధులు**

స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో లేని కాలనీలు, శివారు ప్రాంతాలు, విలీన



కాలనీలకు సీఎంఏ నిధులలో ప్రాధాన్యం ఇచ్చారు. ఒక్కో డివిజన్‌కు కనీసం రూ. కోటి నుంచి రూ. 4 కోట్ల వరకు కేటాయించినట్లు తెలిసింది. ఒక్కో విలీన కాలనీకి సుమారు రూ. 3 కోట్లకు తగ్గకుండా నిధులు మంజూరు చేసినట్లుగా చెబుతున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులు కూడా ఇందులోనే పూర్తి చేసే అవకాశముంది.

**ప్యాకేజీ పద్ధతిలో..**

స్మార్ట్‌సిటీలో ప్యాకేజీ పద్ధతిలోనే అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. తద్వారా నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేస్తుండటంతో సీఎంఏ నిధులకు సంబంధించి కొత్తగా ఇచ్చిన ప్రతిపాదనలకు సింగిల్ ప్యాకేజీలో టెండర్లు పిలిచేలా పురపాలక శాఖ జారీ చేసిన ఉత్తర్వులో స్పష్టం చేశారు. గతంలో టెండర్లు దక్కించుకొని పనులు చేయకుండా మొండికేసిన గుత్తేదారులతో ప్రజలు, పాలకవర్గ సభ్యులు నానా అవస్థలు పడ్డారు. పైగా పనులు చేసేందుకు తవ్వి వదిలేయడంతో రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ పరిస్థితి రాకుండా గడువులోగా, ఏకకాలంలో పనులు చేసేలా కార్యాచరణ చేసినట్లుగా తెలుస్తోంది.

15లోగా టెండర్లు ముఖ్యమంత్రి హామీ నిధులకు సంబంధించి మిగులు నిధులు రూ. 132.94 కోట్లకు పురపాలక పరిపాలన, పట్టణావృద్ధి శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్వింద్‌కుమార్ ఈ నెల 24న మెమో జారీ చేశారు. నిధులకు పరిపాలన అనుమతి ఇస్తూ త్వరితగతిన టెండర్లు పిలిచి అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. దాంతో సుమారు 166కి పైగా పనులు చేపట్టేందుకు వీలు కలిగింది. సీఎంఏ నిధుల మంజూరు నేపథ్యంలో వచ్చే నెల 15లోగా టెండర్లు పూర్తి చేసి ఆ నెలాఖరులోగా పనులు ప్రారంభిస్తామని కరీంనగర్ మేయర్ సునీల్‌రావు పేర్కొన్నారు.

# నీళ్లిచ్చే కాల్వలపై నిర్లక్ష్యం

జగిత్యాల : సాధారణంగా జూన్ మొదటి పక్షం నుంచి వానాకాలం పంటలసాగు మొదలవుతుండగా ఈ వానాకాలంలో నెల రోజుల ముందుగానే సాగు చేపట్టాలని రాష్ట్రప్రభుత్వం రైతులకు సూచిస్తోంది. ఈ తరుణంలో పంటకాలం ముందుకు జరిగేలా పలు వ్యవసాయ అనుబంధ శాఖలు సిద్ధమవుతుండగా నీటిపారుదల పరంగానూ తగిన మరమ్మతు చర్యలను చేపట్టాల్సి ఉంది.

జగిత్యాల జిల్లాలో దాదాపు 87 శాతం వరకు అధికవర్షం కురియటం, ఏప్రిల్ వరకు కాలువనీరు రావటంతో ఆయకట్టులో తలపెట్టిన మరమ్మతులు పూర్తికాలేదు. దీంతో తక్షణమే మరమ్మతులు చేపట్టకుంటే కాలువల చివరి ఆయకట్టు వరకు నీరందటం గగనంగా మారనుంది. కాకతీయ ప్రధాన కాలువ, డిస్ట్రిబ్యూటరీలు, ఉప కాలువల లైనింగ్ దెబ్బతినటం, కాలువల్లో చెట్లు పెరగటం, షట్టర్లు, కట్టలు శిథిలం కావటం తదితరాలతో నీటి తరలింపు సామర్థ్యం తగ్గింది. 9 వేల క్యూసెక్కుల సామర్థ్యంగల కాకతీయ కాలువలోనే ప్రస్తుతం 6 వేల క్యూసెక్కులకు మించి నీటిని తరలిస్తే గండ్లు పడుతుండటంతో తక్కువనీటినే వదులుతున్నారు. యూటీలు, డ్రాపులు, సూపర్ ప్యాసేజ్‌లు, అక్విడెక్టులు తదితర నిర్మాణాలు దెబ్బతినటంతో నీటిని తరలించలేని పరిస్థితి తలెత్తింది. కాలువల్లో నిండుగా నీటిని వదలకపోగా పారే కొద్దిపాటి నీటిని మోటార్ల ద్వారా ఎత్తిపోయటంతో 38 వేల ఎకరాల చివరి ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొంది. దీనికిగాను కాలువల లైనింగ్‌ను పూర్తిచేయాలి.

నిధుల విడుదలలో జాప్యంవరదకాలువ నుంచి కాకతీయ కాలువలోకి నీటిని తరలించేలా మల్యాల మండలంలో చేపట్టిన అనుసంధాన కాలువ నిర్మాణం పూర్తికావటంతో వచ్చే సీజనుకు అందుబాటులోకి తేవాలి. దెబ్బతిన్న నిర్మాణాలకు సీజన్ విరామంలో మరమ్మతుల ద్వారా చివరిభూముల వరకు నీటిని తరలించేలా చూడాలి. ప్రస్తుతం రూ. 103 కోట్లవరకు మరమ్మతులు, ఇతర పనులకు వెచ్చించినా సకాలంలో నిధులు రాక చాలావరకు పనులను చేపట్టలేదు. ఇప్పటికైనా అన్ని మరమ్మతు, లైనింగ్ పనులను పూర్తిచేస్తే వచ్చే పంటకాలాల్లో కర్షకులకు ఉపయుక్తంగా ఉంటుంది. కాకతీయ కాలువతో పాటుగా వరదకాలువనుంచి చెరువులు, కుంటల్లోకి నీటిని తరలించే తూములు, కాలువల నిర్మాణాన్ని పూర్తిచేయాలి. గొలుసుకట్టు చెరువుల్లోకి నీటిని తరలిస్తే భూగర్భ జలమట్టం పెరిగి పంపుసెట్ల ద్వారానూ నీటిని పారించవచ్చు. పరాధీనమైన ప్రాజెక్టు భూములను స్వాధీనం చేసుకోవాలి. చెక్‌డ్యాంలు పూర్తిచేయాలి... రోళ్లవాగు ప్రాజెక్టును రూ. 120 కోట్ల నిధులతో ఆధునికీకరిస్తున్నా దీనికి ఎస్సారెస్పీ నీటితోనే నింపాల్సి ఉంటుంది. ఎస్సారెస్పీ నిండని సందర్భాల్లో 2.5 టీఎంసీల సామర్థ్యం కలిగిన రోళ్లవాగులోకి గోదావరి నీటిని ఎత్తిపోసేలా బీర్పూర్ మండలం రంగసాగర్‌వద్ద ఎత్తిపోతల పథకాన్ని చేపట్టాలి. గోదావరి నుంచి జగిత్యాల జిల్లాలోని 26 గ్రామాలకు తలపెట్టిన ఎత్తిపోతల పథకాలను పూర్తిచేయాలి. ఇదివరకున్న పథకాలకు మరమ్మతులు జరపటంతో పాటుగా ఎత్తిపోతలను పొడిగిస్తే ఆయకట్టేతర మండలాలకూ ప్రయోజనం కలుగుతుంది. వాగులపై తలపెట్టిన 75 చెక్‌డ్యాంల నిర్మాణాన్ని పూర్తిచేయాలి. మిషన్ కాకతీయ ద్వారా మిగిలిన చెరువుల పునరుద్ధరణను పూర్తిచేయాలి. గతంలో మాదిరిగా సాగునీటి సంఘాలను నియమించి కాలువలు, చెరువుల నిర్వహణ, ఆజమాయిషీ, స్థానిక మరమ్మతుల బాధ్యతలను అప్పగించాలి. వీటిలో రైతులే సభ్యులుగా ఉంటారు కాబట్టి నీటి యాజమాన్యం సాధ్యమవుతుంది.




## విశాఖలో ఆటో-లారీ ఢీ.. చిన్నారులకు తీవ్ర గాయాలు..

విశాఖ నగరంలోని సంగం శరత్ థియేటర్ కూడలి వద్ద పాఠశాల విద్యార్థులు ప్రయాణిస్తున్న ఆటో.. లారీని ఢీకొట్టింది. బుధవారం ఉదయం రైల్వే స్టేషన్ నుంచి సిరిపురం వైపు విద్యార్థులతో వెళ్తున్న ఆటో అదుపుతప్పి లారీని ఢీకొంది. దీంతో ఆటో ఒక్కసారిగా మూడు పల్టీలు కొట్టింది. ఆటోలో ఉన్న ఏడుగురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాద దృశ్యాలు సీసీటీవీలో రికార్డయ్యాయి.

## ఆ ఘటన అత్యంత బాధాకరం



అమరావతి: విశాఖపట్నంలో స్కూల్ పిల్లలతో వెళ్తున్న ఆటో రోడ్డు ప్రమాదానికి గురవడం అత్యంత బాధాకరమని ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి తెలిపారు. బుధవారం నాడు బీజేపీ పార్టీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.."ఈ ప్రమాద దృశ్యాలు చాలా హృదయవిదారకంగా ఉన్నాయి. వీడియో దృశ్యాలు చూస్తే కళ్లు చెమర్చాయి. ఈ ప్రమాదంలో అభంశుభం తెలియని చిన్నారులు గాయాల పాలై వారు క్షోభను అనుభవించడం చూస్తుంటే కళ్లు చెమర్చుతున్నాయి. ఈ ప్రమాద ఘటనపై తక్షణమే ప్రభుత్వం పూర్తి స్థాయిలో విచారించి, తగిన చర్యలు తీసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులకి మెరుగైన వైద్య సహాయం అందించాలి" అని పురంధరేశ్వరి డిమాండ్ చేశారు.

## పిల్లల ఆటో ప్రమాదం నా గుండెను పిండేసింది



అమరావతి : విశాఖలో జరిగిన స్కూలు పిల్లల ఆటో ప్రమాదం తనను షాక్ కు గురిచేసిందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పేర్కొన్నారు. తన గుండెను పిండేసిందన్నారు. పసి బిడ్డలకు ఏమీ కాకూడదని.. తిరిగి ఆడుతూ పాడుతూ స్కూలుకు వెళ్లే రోజు త్వరగా రావాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నానన్నారు. ధైర్యంగా ఉండాలని తల్లిదండ్రులను కోరుతున్నానని నారా లోకేష్ పేర్కొన్నారు. విశాఖలోని సంఘం శరత్ వద్ద స్కూలు పిల్లలను తీసుకెళుతున్న ఆటోను లారీ ఢీకొట్టింది. స్కూలు పిల్లలతో వెళ్తున్న ఆటోను లారీ ఢీ కొట్టింది. 8 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. విద్యార్థుల్లో నలుగురు బాలికలు, నలుగురు బాలురులు ఉన్నారు. ఇప్పటికే ముగ్గురు డిశ్చార్జ్ అయ్యారు. నలుగురు విద్యార్థులకు ఎటువంటి ప్రాణహాని లేదు. ఒక పాప పరిస్థితి సీరియస్‌గా ఉంది. ప్రమాద స్థలాన్ని నగర డీసీపీ శ్రీనివాస్ పరిశీలించారు. లారీ డ్రైవర్‌తో పాటు క్లీనర్‌ను పోలీసులు విచారిస్తున్నారు.

## దెబ్బమీద దెబ్బతో దిక్కుతోచని స్థితిలో వైసీపీ



అమరావతి: దెబ్బమీద దెబ్బతో వైసీపీ దిక్కుతోచని స్థితిలో ఉందని ఏపీ టీడీపీ అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడారు. టీడీపీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంతో వైసీపీ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. రోజూ స్వచ్ఛందంగా లక్షలాది మంది భవిష్యత్ గ్యారెంటీ రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారని అన్నారు. చంద్రబాబుకు బెయిల్ మంజూరు కావడంపై జగన్ రెడ్డి , వైసీపీ గ్యాంగ్ అసహనంలో ఉన్నారని పేర్కొన్నారు. అసహనంతో ఏం మాట్లాడుతున్నారో తెలియని స్థితికి బులుగు బ్యాచ్ చేరిందని అచ్చెన్నాయుడు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. గడపగడప ప్రభుత్వం కార్యక్రమానికి వెళ్లిన వైసీపీ నేతలను ప్రజలు తరిమి తరిమి కొట్టారని అన్నారు. టీడీపీ భవిష్యత్తుకు గ్యారెంటీకి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారని, ఆ అసహనంతో జగన్ ముఠా పిచ్చిపట్టినట్లు వ్యవహరిస్తోందని ఆయన మండిపడ్డారు. భవిష్యత్తులో అందించే పథకాల గురించి చెబుతుంటే ఎందుకంత అసహనం అని వైసీపీ నేతలను ఆయన ప్రశ్నించారు. ఆడబిడ్డకు నెలకు రూ.1500 ఇస్తామంటే వైసీపీకి ఎందుకంత కోపమని ప్రశ్నించారు. చదువుకునే ప్రతి బిడ్డకు రూ.15వేలు ఇస్తామంటే ఎందుకంత అసహనమని, ఏటా 3 సిలిండర్ల హామీపై ఎందుకంత కడుపు మంట అని అన్నారు. అన్నదాతకు రూ.20 వేలు ఇస్తామంటే ఎందుకంత అక్కసు అంటూ విరుచుకుపడ్డారు. బీసీలకు రక్షణ చట్టం తెస్తామంటే బరితెగింపు మాటలేల? అని అన్నారు. ఇంకెన్నాళ్లీ తప్పుడు ప్రచారాలతో కాలం నెట్టుకొస్తారని ప్రశ్నిస్తూ.. జగన్ రెడ్డిలా ప్రజల వ్యక్తిగత డేటా టీడీపీ సేకరించడం లేదని తెలిపారు. వాలంటీర్లతో వివాహేతర సంబంధాల గురించి ఆరా తీసిందెవరని నిలదీశారు. సమాచారాన్నంతా రామ్ ఇన్ఫోటెక్ కంపెనీకి దోచిపెట్టిందెవరని అడిగారు. 2024 ఎన్నికల తర్వాత వైసీపీని బంగాళాఖాతంలో కలిపేయడం తథ్యమని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## ఏపీలో జనసేనతో పొత్తుపై జీవీఎల్ నరసింహారావు కీలక వ్యాఖ్యలు



విజయవాడ: ఏపీలో జనసేనతో పొత్తుపై బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు కీలక వ్యాఖ్యలు చేశారు. జనసేన, బీజేపీ బంధంపై ఎలక్షన్లు దగ్గరపడే కొద్దీ మరింత స్పష్టత వస్తుంది. మరెవరినైనా కలుపుకోవాలా అనే దానిపై భవిష్యత్తులో చర్చిస్తాం. జనసేన పొత్తుపై మాకెలాంటి కన్ఫ్యూజన్ లేదు. 175 నియోజకవర్గాలల్లో డిసెంబర్ నుంచి మా పార్టీ బలోపేతం అవడానికి పని చేస్తుంది. ఏపీ అధ్యక్షులు ఎవరైనా మా పార్టీ అభివృద్ధికే నిర్ణయాలుంటాయి. తెలంగాణలో బీఆర్ఎస్‌ను ఓడించగల పార్టీగా బీజేపీ ఉంది. ఇండియా అలయెన్స్‌లో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ అన్ని చోట్ల పోటీ చేస్తోంది. అందరూ కలిసొచ్చినా, విడివిడిగా వచ్చినా, ఇంకో నలుగురిని తెచ్చుకున్నా మోదీదే గెలుపు. బీజేపీపై ఏ పార్టీ వ్యాఖ్యలు చేసినా వారిది అభద్రతా భావమే. కమ్యూనిస్టులు దిక్కు తోచక ప్రధాని మోదీపై అనేక ఏడుపుకొట్టు మాటలు మాట్లాడుతున్నారు. కమ్యూనిస్టులు దాదాపు కనుమరుగయ్యారు..తెలంగాణాలో ఒకటో రెండో సీట్లు పొందారు. ఏపీలో కూడా సీట్లు కోసం కమ్యూనిస్టులు ఇలా మాట్లాడుతున్నారు" అని ఎంపీ జీవీఎల్ నరసింహారావు ఎద్దేవ చేశారు.

**జలజీవన్ మిషన్‌ను అమలు సరిగా జరగడం లేదు :** "దిశ రాష్ట్ర స్థాయి కమిటీ సమావేశం ఈరోజు జరిగింది... మొదటిగా ఈ సమావేశం చాలా ఆలస్యంగా జరిగింది. ఉచిత బియ్యం పక్కదారి పడుతోంది అని కూడా సమావేశంలో మాట్లాడాను. ఈ కమిటీలో కేంద్ర పథకాల అమలు గురించి చర్చించాం.. జలజీవన్ మిషన్ వంటివి అమలు సరిగా జరగడం లేదు. ఇళ్ల నిర్మాణం మూడు నెలల్లో పూర్తిచేయాలని చెప్పాను. NREGS నరేగా పథకం అమలుపై చర్చించాం. రైతుల బీమా చెల్లించలేదని అధికారులే చెప్పారు.

కేంద్ర ప్రభుత్వ పథకాల పేర్లు మార్చొద్దని కోరాను. తూర్పు కాపులకు OBC రిజర్వేషన్ ఇవ్వాలని NCBC నిర్ణయించింది. మరో రెండు రోజుల్లో అధికారిక ప్రకటన వస్తుంది. తూర్పు కాపులకు ఓబీసీ రిజర్వేషన్ కల్పించాలని ప్రతిపాదించాను. రాష్ట్ర ప్రభుత్వం నివేదిక తెప్పించుకుని, కేంద్రం NCBC సమావేశం నిర్వహించింది" అని ఎంపీ జీవీఎల్ నరసింహారావు తెలిపారు.

## డ్రగ్స్ అడ్డాలుగా మెడికల్ కాలేజీలు.. ఏపీలో పరిస్థితి ఘోరం..



అమరావతి: ఒంగోలు మెడికల్ కాలేజీలో జరిగిన గంజాయి బ్యాచ్ దాడులపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ స్పందించారు. ప్రజల ఆరోగ్యాలు కాపాడే బావి డాక్టర్లు గంజాయికి బానిసలై ఉన్మాదులుగా మారి కొట్టుకుని ఆసుపత్రిలో పేషెంట్లు అయ్యారని వ్యాఖ్యానించారు. మెడికల్ కాలేజీలు డ్రగ్స్ అడ్డాలుగా మారాయని, కర్నూలు, ఒంగోలు మెడికల్ కాలేజీలలో గంజాయి బ్యాచ్‌ల దాడులతో ఈ విషయం స్పష్టమైందని అన్నారు. మత్తుకి బానిసైన కొంతమంది మెడికోల హింసాత్మక ప్రవర్తన చూశాక రాష్ట్రంలో పరిస్థితిపై భయమేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. స్కూల్లో విద్యార్థులు గంజాయికి బానిసవ్వడం 'యువగళం పాదయాత్ర'లో చూశానని ప్రస్తావించారు.




## హాట్‌కేక్స్‌లా టాటా టెక్ షేర్లు...

ముంబయి: టాటా గ్రూప్ నుంచి చాలా రోజుల తర్వాత ఐపీఓకు వచ్చిన టాటా టెక్నాలజీస్ షేర్లు హాట్ కేకుల్లా అమ్ముడయ్యాయి. సబ్‌స్క్రిప్షన్‌కు వచ్చిన కొన్ని నిమిషాల్లోనే షేర్లు పూర్తిగా సబ్‌స్క్రైబ్ అయ్యాయి. రూ.3042.5 కోట్లు సమీకరించేందుకు టాటా టెక్ ఐపీఓ ఈ ఉదయం ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఆఫర్ ఫర్ సేల్ కింద 4,50,29,207 (నాలుగున్నర కోట్లు) షేర్లను అందుబాటులో ఉంచగా సబ్‌స్క్రిప్షన్లు తెరిచిన 40 నిమిషాల్లోనే పూర్తిగా సబ్‌స్క్రైబ్ అయ్యాయి. ఎన్ఎస్ఈ డేటా ప్రకారం.. ఉదయం 11.21 గంటలకు 8,73,22,890 (8 కోట్లకు పైగా) బిడ్లు దాఖలయ్యాయి. అంటే 1.94 రెట్లు సబ్‌స్క్రైబ్ అయినట్లు అన్నమాట. కేటగిరీ వారీగా చూస్తే.. నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల కోటా 2.72 రెట్లు, క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్ల కోటా 1.98 రెట్లు, రిటైల్ పోర్షన్ 1.63 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యాయి. మంగళవారం యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి టాటా టెక్ రూ.791 కోట్లు సమీకరించింది. ఐపీఓలో భాగంగా 6.08 కోట్ల షేర్లను కంపెనీ అందుబాటులో ఉంచింది. ఈ పబ్లిక్ ఇష్యూ ద్వారా టాటా మోటార్స్ తమ వాటాలో 11.4 శాతాన్ని ఉపసంహరించుకుంటోంది. అదనంగా ఆల్ఫా టీసీ హోల్డింగ్స్ 2.4 శాతం, టాటా క్యాపిటల్ గ్రోత్ ఫండ్-I 1.2 శాతం వాటాలను విక్రయిస్తున్నాయి. ఈ ఐపీఓ పూర్తిగా 'ఆఫర్ ఫర్ సేల్' ప్రాతిపదికన జరుగుతున్న నేపథ్యంలో సమీకరించిన నిధులు కంపెనీకి చెందబోవు. 2004లో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌ను పబ్లిక్ ఇష్యూకు తీసుకొచ్చిన టాటా గ్రూప్ దాదాపు రెండు దశాబ్దాల తర్వాత మళ్లీ మరో సంస్థను ఐపీఓకు తీసుకురావడం ఇదే. టాటా టెక్నాలజీస్ షేర్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో లిస్ట్ కానున్నాయి.

**గాంధార్ సైతం..** గాంధార్ ఆయిల్ రిఫైనరీ ఇండియా ఐపీఓ సైతం సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమైన గంటల్లోనే పూర్తిగా సబ్‌స్క్రైబ్ అయ్యింది. మొత్తం రూ.500 కోట్లు సమీకరించాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. రూ.302 కోట్లకు సమానమైన తాజా షేర్లతో పాటు 198 కోట్ల విలువ చేసే షేర్లను ప్రమోటర్లు ఆఫర్ ఫర్ సేల్ ద్వారా విక్రయిస్తున్నారు. మొత్తం 2,12,43,940 (2 కోట్లకు పైగా) షేర్లు అందుబాటులో ఉంచగా.. గంటల్లోనే పూర్తిగా సబ్‌స్క్రైబ్ అయ్యాయి. ఎన్ఎస్ఈ డేటా ప్రకారం.. 11.45 గంటల సమయానికి 1.40 రెట్లు అంటే 2,96,40,864 బిడ్లు దాఖలయ్యాయి. రిటైల్ పోర్షన్ 2.01 రెట్లు, నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల కోటాకు 1.76 రెట్లు చొప్పున బిడ్లు దాఖలయ్యాయి. నవంబర్ 24న సబ్‌స్క్రిప్షన్ ముగియనుంది. ధరల శ్రేణిని రూ.160- 169గా నిర్ణయించారు.




దిల్లీ: ఖలిస్థానీ అంశంపై భారత్, కెనడా మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. దాదాపు 2 నెలలుగా కెనడా పౌరులకు నిలిపివేసిన ఈ-వీసా సేవలను భారత్ బుధవారం పునరుద్ధరించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ వర్గాలను ఉటంకిస్తూ పలు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. జీ20 దేశాధినేతల వర్చువల్ సమావేశానికి ముందు ఈ నిర్ణయం వెలువడటం గమనార్హం. దౌత్యపరమైన ఉద్రిక్తతల నేపథ్యంలో.. ఈ ఏడాది సెప్టెంబరు 21 నుంచి కెనడియన్లకు వీసా సర్వీసులను భారత్ నిలిపివేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఈ నిర్ణయాన్ని కొంత మార్చుకుంది. భద్రతాపరమైన పరిస్థితులను సమీక్షించిన అనంతరం అక్టోబర 26 నుంచి కెనడా పౌరులకు ఎంట్రీ వీసా, బిజినెస్ వీసా, మెడికల్ వీసా, కాన్ఫరెన్స్ వీసా కేటగిరీల్లో సేవలను పునరుద్ధరించారు. తాజాగా ఈ-వీసా సేవలను కూడా అందుబాటులోకి తెచ్చినట్లు సమాచారం. దీంతో ఇప్పుడు కెనడా పౌరులకు అన్ని రకాల వీసా సర్వీసులను భారత్ పునరుద్ధరించినట్లైంది.

**మోదీ వర్చువల్ సదస్సుకు.. ట్రూడో :** భారత ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన జీ20 దేశాధినేతల వర్చువల్ సదస్సు జరగది. ఈ భేటీలో కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో కూడా పాల్గొననున్నారు. ఉద్రిక్తతల నేపథ్యంలో ఇటీవల జరిగిన జీ20 దేశాల స్పీకర్ల సదస్సుకు కెనడా దూరంగా ఉంది. దీంతో తాజా సమావేశానికి ట్రూడో హాజరవుతారా లేదా అనే దానిపై సందిగ్ధత నెలకొనగా.. దానిపై ఒట్టావా స్పష్టతనిచ్చింది. అయితే, ఈ భేటీ జరగనున్న సమయంలో వీసాల పునరుద్ధరణ వార్తలు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఖలిస్థానీ ఉగ్రవాది నిజ్జర్ హత్య విషయంలో భారత్‌పై తీవ్ర ఆరోపణలు చేసిన కెనడా ప్రధాని.. అక్కడి మన దౌత్యవేత్తపై బహిష్కరణ వేటు వేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ట్రూడో వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన భారత్.. మన దేశంలో కెనడా రాయబారిని కూడా బహిష్కరించింది. అంతేగాక, కెనడాలో హింసాత్మక ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో అక్కడి ప్రవాస భారతీయులు, కెనడా వెళ్లాలనుకునేవారు అత్యంత అప్రమత్తంగా ఉండాలంటూ ఓ అడ్వైజరీ కూడా జారీ చేసింది. అదే సమయంలో దౌత్య సిబ్బంది విషయంలో ఇరు దేశాల మధ్య సమస్థాయి ఉండాలని పేర్కొంటూ.. భారత్‌లో తమ దౌత్యవేత్తల సంఖ్యను తగ్గించుకోవాలని ట్రూడో సర్కారుకు సూచించింది.

## సామాజిక న్యాయంలో సీఎం జగన్ దేశానికే ఆదర్శం: ఆర్.కృష్ణయ్య




తాడేపల్లి: సీఎం జగన్.. కుల గణన నిర్ణయం హర్షణీయం అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య అన్నారు. బుధవారం ఆయన తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మాట్లాడుతూ, దేశమంతా సీఎం జగన్ నిర్ణయాలను మెచ్చుకుంటున్నారని, రానున్న రోజుల్లో ఇంకా మరింత సంక్షేమం బీసీలకు అందుతుందన్నారు. చరిత్రలో సీఎం జగన్ పేరు చిరస్థాయిగా ఉంటుంది. గుడిసెలో ఉండేవారు సైతం డాక్టర్లు, ఇంజనీర్లు అవుతున్నారు. పిల్లల చదువులతో కుటుంబాల జీవితాలు మారిపోతున్నాయి. విదేశాలలో మన వాళ్లు ఎక్కడ చూసినా కనిపిస్తున్నారు. జగన్ చేపట్టినన్ని సంస్కరణలు మరెవరూ చేయలేదు. చంద్రబాబు బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకున్నారు. సరైన పదవులు కూడా ఇవకుండా మమ్మల్ని అవమానపరిచారు. ఏ రాష్ట్రం వెళ్లినా ఏపీ గురించి, జగన్ గొప్పగా చెప్పుకుంటున్నారు" అని కృష్ణయ్య పేర్కొన్నారు. "లోటు బడ్జెట్ ఉన్నా మెరుగైన సంక్షేమం అందిస్తున్నది జగన్ మాత్రమే. ఇతర నాయకులు జనాన్ని ఓటర్లుగా మాత్రమే చూస్తారు. జగన్ మాత్రమే తమ కుటుంబ సభ్యులుగా చూస్తారు. అందుకే వారందరికీ మేలు చేస్తున్నారు. కులాల లెక్కలు తీయటం వలన రిజర్వేషన్లు పెరుగుతాయి. పదవులు ఇంకా పెరుగుతాయి. బీసీల నాయకత్వం జగన్ హయాంలో బాగా పెరిగింది. కులాల లెక్కలు తీయటానికి పాలకులు భయపడతారు. కానీ సీఎం జగన్ ఎంతో ధైర్యంగా ఆ పని చేస్తున్నారు. 18 మందికి ఎమ్మెల్సీలు ఇస్తే అందులో 11మంది బీసీలకే ఇచ్చారు. బస్సుయాత్రలకు జనం నుండి విశేష స్పందన లభిస్తోంది. బీసీల అభ్యున్నతికి జగన్ చేస్తున్న సహాయం మరువలేనిది" అంటూ కృష్ణయ్య కొనియాడారు.

## నిజాయితీ, నిబద్ధతకు కేరాఫ్ అడ్రస్ సీఎం జగన్



ప్రకాశం: నాలుగున్నరేళ్ళలో రాష్ట్రంలో అన్ని రంగాల్లో సాధికారత సాధించామని మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. రాజకీయంగా అన్ని వర్గాలను చెయ్యి పట్టుకుని నడిపించామన్నారు. టీడీపీ హయాంలో ఎన్నికల సమయంలో మాత్రమే అణగారిన వర్గాలు గుర్తుకు వచ్చేవని విమర్శించారు. అన్ని కులాల ఆర్థిక స్వావలంభన కోసం సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. సీఎం జగన్ చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకే సాధికారిక యాత్ర చేపట్టారు. ఏపీ పథకాలు పొరుగు రాష్ట్రాలకు ఆదర్శంగా మారాయన్నారు. రాబోయే రోజుల్లో సరైన నిర్ణయం తీసుకుని జగన్ మరోసారి సీఎంను చేసుకోవాలని కోరారు. నిజాయితీ, నిబద్ధతకు కేరాఫ్ అడ్రస్ సీఎం జగన్ అని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలు ఐక్యరాజ్య సమితిలో ప్రసంగించే స్థాయికి వెళ్ళారంటే అది సీఎం జగన్ ఘనత అని మంత్రి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు.

# సాగర కన్యగా ఇస్మార్ట్ బ్యూటీ..!

ఇస్మార్ట్ బ్యూటీ నభా నటేష్ చేసిన తక్కువ సినిమాలతోనే తెలుగులో మంచి ఫాలోయింగ్ ఏర్పరచుకుంది. కన్నడలో వరుస 3 సినిమాలు చేసి ఆ తర్వాత తెలుగు తెరకు పరిచయమైన అమ్మడు ఐదేళ్ల కెరీర్ లో 7 సినిమాలు చేసింది. వాటిలో ఇస్మార్ట్ శంకర్ తప్ప మరో సినిమా ఆమెకు క్రేజ్ తీసుకు రాలేదు. 2021 లో మ్యాస్ట్రో సినిమా చేసిన నభా నటేష్ ఆ తర్వాత ఒక్క ఛాన్స్ కూడా అందుకోలేదు. మధ్యలో ఒక యాక్సిడెంట్ వల్ల ఆడియన్స్ కు దూరంగా ఉన్న అమ్మడు ఫైనల్ గా మళ్లీ తన గ్లామర్ ట్రీట్ తో అలరిస్తుంది. సినిమాలు చేసినా చేయకపోయినా నభా నటేష్ సోషల్ మీడియాలో ఫోటో షూట్స్ మాత్రం అదరగొట్టేస్తుంది. అమ్మడు చేస్తున్న ఈ ఫోటో షూట్స్ చూసిన ఎవరైనా సరే ఆమె మాయలో పడక తప్పదు. సినిమా ఛాన్స్ లు రావట్లేదా లేక తనే కావాలని చేయట్లేదా అన్నది తెలియదు కానీ ఫోటో షూట్స్ తోనే సరి పెట్టుకుంటుంది నభా నటేష్. ఇక లేటెస్ట్ గా స్కిన్ టైట్ డ్రెస్ తో



మరోసారి వావ్ అనిపించేలా చేసింది అమ్మడు. ఒంటికి అంటుకుపోయినట్టుగా వేసుకున్న అమ్మడి డ్రెస్.. పరువాలకు పనిచెబుతూ నభా చేస్తున్న ఈ గ్లామర్ షో ఆమెకు మంచి మైలేజ్ తెచ్చి పెట్టేలా చేస్తుంది. క్రీం కలర్ డ్రెస్ లో సాగర కన్యలా అలా నభా చూసే చూపులకు ఎలాంటి వారైనా సరే డిస్టర్బ్ అవ్వాల్సిందే అని చెప్పొచ్చు. సోషల్ మీడియాలో తన ఫోటో షూట్స్ వల్లే 5 మిలియన్స్ దగ్గర దాకా ఫాలోవర్స్ ని ఏర్పరచుకుంది అమ్మడు. ప్రస్తుతం నభా నటేష్ లేటెస్ట్ ఫోటో షూట్స్ సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. అమ్మడు చేస్తున్న ఈ ఫోటో షూట్స్ తోనే ఇంత హంగామా సృష్టిస్తుంటే నభా వరుస సినిమాలు చేస్తే మాత్రం స్టార్ రేంజ్ కి వెళ్లడం పక్కా అని చెప్పొచ్చు. ఇక అమ్మడి సినీ కెరీర్ అంత దూకుడుగా లేకపోయినా ఆమె చేస్తున్న ఫోటో షూట్స్ తోనే నభా గ్రాఫ్ పెరుగుతుంది. కచ్చితంగా కొద్దిగా వెయిట్ చేస్తే మాత్రం నభా నటేష్ కి మంచి అవకాశాలు వస్తాయని చెప్పొచ్చు. అప్పటిదాకా నభా నటేష్ ఫోటో షూట్స్ తోనే ఆమె ఫ్యాన్స్ అడ్జెస్ట్ అవ్వాల్సిందే మరి.

# స్వీటీ అనుష్కని వదలనంటున్న క్రేజీ మేకర్స్

రెండేళ్ల విరామం తరువాత స్వీటీ అనుష్క నటించిన 'నిశ్శబ్దం' భారీ షాక్ ఇచ్చింది. మిస్టరీ థ్రిల్లర్‌గా హేమంత్ మధుకర్ రూపొందించిన ఈ సినిమాని పాన్ ఇండియా మూవీగా తెలుగుతో పాటు ఐదు భాషల్లో రిలీజ్ చేశారు. ఏ భాషలోనూ కనీసం యావరేజ్ టాక్‌ని కూడా దక్కించుకోలేకపోయింది. స్వీటీ భారీ అంచనాలు పెట్టుకుని చేసిన సినిమా డిజాస్టర్ కావడంతో మరో సినిమా కోసం దాదాపు మూడేళ్లు విరామం తీసుకుంది. ఫైనల్‌గా యువీ క్రియేషన్స్ వారికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. 'జాతిరత్నాలు' సినిమాతో సంచలన విజయాన్ని సొంతం చేసుకుని టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచినయంగ్ హీరో నవీన్ పొలిశెట్టితో కలిసి అనుష్క నటించిన రొమాంటిక్ కామెడీ 'మిస్‌శెట్టి మిస్టర్ పొలిశెట్టి'. సెప్టెంబర్ 7న భారీ పోటీ మధ్య ప్రేక్షకుల



ముందుకొచ్చింది. తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదలైన ఈ సినిమా మంచి టాక్‌ని సొంతం చేసుకుంది. అయితే ఓ పక్క తలైవా 'జైలర్' హవా, మరో పక్క షారుక్ ఖాన్ 'జవాన్' దూకుడు ముందు 'మిస్‌శెట్టి మిస్టర్ పొలిశెట్టి' తన ప్రభావాన్ని ఆశించిన స్థాయిలో చూపించలేకపోయింది. దీంతో అనుష్కకు మంచి బ్లాక్ బస్టర్‌ని అందించాలనే యువీ క్రియేషన్స్ వారి ప్లాన్ పూర్తి స్థాయిలో సక్సెస్ కాలేకపోయింది. ప్రస్తుతం భారీ ప్రాజెక్ట్‌లని నిర్మిస్తూ..మరి కొన్ని పాన్ ఇండియా సినిమాలకు నిర్మాణ భాగస్వామిగా వ్యవహరిస్తున్న యువీ మరోసారి స్వీటీ కోసం రంగంలోకి దిగుతోంది. సూర్య హీరోగా జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్న 'కంగువ' చిత్రానికి, వైఎస్ జగన్ బయోపిక్ ఆధారంగా రూపొందుతున్న 'యాత్ర 2'కు యువీ నిర్మాణ భాగస్వామిగా వ్యవహరిస్తోంది. దీనితో పాటు మరికొన్ని క్రేజీ సినిమాలు చేస్తోంది. వీటితో బిజీగా ఉన్నా అనుష్కతో మరో సినిమాకు శ్రీకారం చుట్టబోతోందని తెలిసింది. ఈ ప్రాజెక్ట్ కోసం కొత్త కథలని అన్వేషిస్తోంది. అంతే కాకుండా అనుష్క ప్రధాన పాత్రలో కథ ఉండేలా కొత్త దర్శకులని వెతుకుతోంది. 'మిస్‌శెట్టి మిస్టర్ పొలిశెట్టి'ని కూడా అనుష్క ప్రధానంగానే నిర్మించిన యువీ మరో సారి అదే పంథాలో సాగే కథని అనుష్క కోసం అన్వేషిస్తుండంతో యంగ్ టాలెంటెడ్ డైరెక్టర్స్ స్క్రిప్ట్‌లు పట్టుకుని యువీ ఆఫీస్ చుట్టూ తిరగడం మొదలు పెట్టారట.




# ఇంకా బుట్టబొమ్మ పొడుగు కాళ్లపైనే ఫోకస్




అల వైకుంఠపురములో పాటల్ని ఇంకా అభిమానులు మర్చిపోలేదు. ఇందులో పూజా హెగ్డే పొడుగు కాళ్ల సొగసును వర్ణిస్తూ రాసిన లిరిక్ అభిమానుల హృదయాల్ని ప్రత్యేకంగా స్పర్శించింది. పూజా పొడుగు కాళ్ల అందాన్ని వర్ణిస్తూ తనని ఆరాధించే ఈ గీతం ఎంతో ప్రత్యేకమైనది. ముఖ్యంగా థమన్ ఎన్నడూ లేనిది అద్భుతమైన మ్యూజిక్ తో అలరించడాన్ని ఎవరూ మర్చిపోలేరు. అందుకే ఇప్పుడు ప్రఖ్యాత మ్యాగజైన్ కవర్ పేజీపై పూజా తన పొడుగు కాళ్ల సొగసును ఆవిష్కరించగా, మరోసారి అల వైకుంఠపురములో ఫీట్ ని బుట్టబొమ్మ సొగసును అభిమానులు గుర్తు చేసుకుంటున్నారు. ప్రఖ్యాత ఫిలింఫేర్ మ్యాగజైన్ తాజా కవర్ పేజీ లుక్ అంతర్జాలంలో సునామీలా మారింది. పూజా ఈ లుక్ లో ఎంతో యూనిక్ గా కనిపిస్తోంది. ఫోటోషూట్ల పరంగా ప్రయోగాత్మకంగాను కనిపిస్తోంది. అందుకే ఈ లుక్ ని అభిమానులు ఎంతో ప్రశంసిస్తున్నారు.

పొడుగు కాళ్ల సుందరి కాలి అందాన్ని ఎంతో గొప్పగా ఆవిష్కరించారు ఈ ఫోటోషూట్ లో. పూజా గుంటూరు కారంలో అవకాశం చేజార్చుకున్నా కానీ, తదుపరి పలు భారీ టాలీవుడ్ సినిమాల్లో నటించనుందని తాజాగా గుసగుసలు వినిపిస్తున్నాయి. వాటికి సంబంధించిన అధికారిక ప్రకటనలు రావాల్సి ఉంది.

# పుష్ప 2 ఇంటర్వెల్‌పై దేవీశ్రీ లీకులు




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుష్పరాజ్ పాత్రలో ఉగ్రరూతలూగించాడు. భయం అన్నదే లేని గంధపు చెక్కల స్మగ్లర్ పాత్రలో జీవించాడు. పుష్ప నడక, నడత, మాటలు, డ్యాన్సుల శైలి అన్నీ ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా అనుకరించడం ఒక సంచలనం. పుష్ప 2 విడుదలకు ఇంకా సమయం ఉన్నా ఈ సినిమా గురించిన ప్రతి అప్ డేట్ అభిమానుల్లో అంతకంతకు వేడి పెంచుతూనే ఉన్నాయి. .ఇప్పుడు పుష్ప 2కి సంగీతం అందించిన దేవి శ్రీ ప్రసాద్ కొన్ని ఆసక్తికరమైన విషయాలను షేర్ చేసారు. పుష్ప 2లో అల్లు అర్జున్ అందర్నీ ఆశ్చర్యపరుస్తాడని దేవి శ్రీ ప్రసాద్ అన్నారు. దర్శకుడు సుకుమార్ తనకు, పాటల రచయిత చంద్రబోస్‌కి కథను చెప్పారని, ప్రతి సన్నివేశాన్ని అంత ఇంటెన్సిటీతో తెరకెక్కించారని కూడా అన్నారు. బన్ని తన నటనతో ప్రేక్షకుల్లో ఉద్వేగం నింపుతారని సంగీత దర్శకుడు దేవీ చెప్పారు. సినిమాలోని సన్నివేశాలను వివరించిన విధానం ఎవరికైనా వెన్నులో వణుకు పుట్టించేలా ఉంటుందని కూడా DSP అన్నారు. ప్రతి సన్నివేశం అభిమానులను సీట్ అంచుకు జారేంతగా సుకుమార్ స్క్రీన్‌ప్లే రూపొందించారని దేవీశ్రీ అన్నారు. సంగీతం ఉగ్రరూతలూగిస్తుందని కూడా నమ్మకంగా చెప్పాడు. ఇంటర్వెల్ బ్యాంగ్ థియేటర్లలో ఆడియెన్ కి ఝలక్ ఇస్తుందని కూడా అన్నాడు! .అల్లు అర్జున్ గురించి మాట్లాడుతూ, పుష్ప 2 లో ఒక ప్రత్యేకమైన సన్నివేశం ఉందని, అది అందరినీ షాక్ కి గురి చేస్తుందని DSP వెల్లడించారు.

జాతర సీక్వెన్స్‌లో అల్లు అర్జున్ గంగమ్మ తల్లి అవతారంలో కనిపించనున్నారు. ఈ సన్నివేశంలో అల్లు అర్జున్ నటన అభిమానులను ఆకట్టుకోవడమే కాకుండా ఆశ్చర్యానికి గురి చేస్తుందని గొప్పగా చెప్పాడు. ఆ సీన్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని అన్నాడు. అల్లు అర్జున్ పుష్ప 2ని గ్రాండ్ లెవల్లో ప్రమోట్ చేయాలనుకుంటున్నాడు. ఇటీవలే సీక్వెల్ మొదటి భాగం కంటే మెరుగ్గా ఉండాలని, రాజమౌళి కంటే పెద్ద స్థాయిలో ఎలివేట్ అవ్వాలని భావించారని కూడా కథనాలొచ్చాయి. కంటెంట్ కి తగ్గట్టే కాన్వాస్ ని కూడా భారీతనంతో మలిచారు. యాక్షన్ కంటెంట్ లో సూపర్ హీరోయిజాన్ని ఎలివేట్ చేయనున్నారని తెలిసింది. ఈ సీక్వెల్‌లో శ్రీవల్లి పాత్రలో రష్మిక మందన్న నటిస్తుండగా, అనసూయ కూడా తన పాత్రలో ప్రత్యక్షమవుతుంది. ఫహద్ ఫాసిల్ ప్రతినాయకుడిగా, ఎస్పీ భన్వర్ సింగ్ షెకావత్‌గా తిరిగి అలరించనున్నారు. జగదీష్ ప్రతాప్ బండారి, ప్రకాష్ రాజ్, జగపతి బాబు తదితరుల నటన మరో లెవల్లో ఉంటుంది. పుష్ప2 చిత్రీకరణ అక్టోబర్ 2022లో ప్రారంభమైంది. ఈ చిత్రం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 15 ఆగస్ట్ 2024న విడుదలవుతోంది.

# నీళ్లలో తెలుగమ్మాయ్ పవిట జారిందేమిటో!

తనదైన అందం కిల్లర్ లుక్ తో వేడి పెంచుతోంది తెలుగమ్మాయ్ నందినిరాయ్. బిగ్ బాస్ బ్యూటీగా సుపరిచితురాలైన నందిని రాయ్ నిరంతర ఫోటోషూట్లు అంతర్జాలంలో ఇప్పటికే వైరల్ అవుతున్నాయి. ఇప్పుడు నందిని రాయ్ పూల్ సైడ్ ట్రీట్ యూత్ కి కిక్కిస్తోంది. నందిని చాలా సింపుల్ గా జరీ అంచు తెల్ల కోక ధరించింది. చీరలో మత్తెక్కించే అందాలను ఎలివేట్ చేస్తూ అలా ఈత కొలనులోకి దిగింది. కొలనులోంచి నందిని రాయ్ చురుకైన చూపులు కుర్రకారు గుండెల్లో హీట్ పెంచుతున్నాయి. సింపుల్ లుక్ లో టూహాట్ గా కనిపిస్తోంది ఈ బ్యూటీ. ప్రస్తుతం ఈ లేటెస్ట్ ఫోటోషూట్ అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది. అలా నీళ్లలో



జారిన తెలుగమ్మాయి పవిట ట్రెండీ టాపిక్ గా మారింది. 2011లోనే ఫిల్మీ కెరీర్ ని ప్రారంభించిన నందిని రాయ్ ఈ పదేళ్లలో డజను సినిమాల్లో నటించింది. కానీ తన స్థాయిని పెంచుకోవడంలో తడబడింది. ఇటీవల ఈ బ్యూటీ 'ఇన్ ది నేమ్ ఆఫ్ గాడ్' అనే వెబ్ సిరీస్ లో నటించగా అది ఆహాలో అందుబాటులో ఉంది. క్రైమ్ థ్రిల్లర్ జానర్ లో విభిన్నమైన కథాంశం ఉన్న ఈ సిరీస్ లో నందిని రాయ్ నటన ఆకట్టుకుంది. విద్యాసాగర్ ముత్తుకుమార్ ఈ సిరీస్ కు దర్శకత్వం వహించారు. మిస్ ఆంధ్రా నందిని రాయ్ ప్రస్తుతం నటిగా ఎదిగేందుకు చేయని ప్రయత్నం లేదు. అందులో భాగంగానే సోషల్ మీడియాల్లో ఫాలోయింగ్ ని పెంచుకునే ప్రయత్నంలో ఉంది. దళపతి వారిసులో ఓ పాత్రలో నటించిన ఈ బ్యూటీ భాగ్ సాలే, సీఎస్ఐ సనాతన్ వంటి షోలలో నటించింది.

పనిలో పనిగా నందిని రాయ్ వరుస ఫోటోషూట్లను షేర్ చేస్తుంటే, అవి వెబ్ లో దుమారం రేపుతున్నాయి. తెలుగమ్మాయి అన్ స్టాపబుల్ ప్రయత్నాలు చూశాక అయినా మన యువహీరోలు దర్శకనిర్మాతలు అవకాశాలిస్తారేమో చూడాలి.

# అయిదు పదులు దాటిన ఎల్లోర శిల్పం

హైదరాబాద్ లో పుట్టి తెలుగు సినిమా ద్వారా ఇండస్ట్రీకి పరిచయం అయి తక్కువ సమయంలోనే బాలీవుడ్ కు వెళ్లిన ముద్దుగుమ్మ టబు. నటి ఫరాహ్ చెల్లెలు అయిన ఈమె దివంగత హీరోయిన్ దివ్య భారతికి ప్రాణ స్నేహితురాలిగా టాక్. దర్శకేంద్రుడు రాఘవేంద్ర రావు టబును కూలీ నెం.1 సినిమా తో తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేయడం జరిగింది. మూడున్నర దశాబ్దాలుగా సినీ కెరీర్ ను కొనసాగిస్తున్న ముద్దుగుమ్మ టబు. తెలుగు లో కొన్నే సినిమాలు చేసినా కూడా ఎక్కువగా ఉత్తరాది ప్రేక్షకులను అలరించే విధంగా బాలీవుడ్ సినిమాలను చేసింది. హీరోయిన్ గా సుదీర్ఘమైన కెరీర్ ను కలిగి ఉన్న టబు ఇంకా కూడా హీరోయిన్ గానే వెలుగు వెలుగుతున్న విషయం తెల్సిందే. అయిదు పదుల వయసు దాటినా కూడా టబు అందం ఏమాత్రం తగ్గ లేదు. అందుకే హీరోయిన్ గా ఇంకా కూడా



అందాల ఆరబోత చేస్తూ కన్నుల విందు చేస్తోంది. బాబోయ్ ఏంటి ఈ అందాల రచ్చ అంటూ చాలా మంది అభిమానులు సోషల్ మీడియాలో టబు ఫోటోలు చూసిన ప్రతి సారి అనుకుంటూనే ఉంటారు. తాజాగా టబు నెట్ ఫ్లిక్స్ ఓటీటీ కోసం ఖుఫియా అనే సిరీస్ ని చేసింది. ఆ సిరీస్ ప్రమోషన్ లో భాగంగా ఇలా అందాల ఆరబోత ఫోటో షూట్ తో రెచ్చి పోయింది. నిజంగా ఈమె వయసు అయిదు పదులా అనిపించే విధంగా ఈ ఫోటోల్లో టబు కనిపిస్తుంది. అయిదు పదుల వయసులోనూ మూడు పదుల వయసు ముద్దుగుమ్మ గా కనిపిస్తున్న టబు ఈ బ్లాక్ డ్రెస్ లో ఎల్లోర శిల్పం మాదిరిగా ఫోజ్ ఇస్తే నిజంగా ఎల్లోరా శిల్పమేనా అన్నట్లుగా ఉంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ముందు ముందు మరిన్ని బాలీవుడ్ సినిమాలు, సిరీస్ లతో పాటు సౌత్ లో ముఖ్యంగా తెలుగు సినిమాల్లో టబు నటించాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.




కొడంగల్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో భారాస విజయం ఖాయమని.. అందులో ఎలాంటి అనుమానం లేదని భారాస అధినేత, సీఎం కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. కొడంగల్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడిన సీఎం కేసీఆర్.. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. కేసీఆర్ మాట్లాడుతూ.. "నేను ఇప్పటికీ వ్యవసాయం చేస్తున్నా. రైతుల బాధలు నాకు తెలుసు. కాంగ్రెస్ నేతలకు వ్యవసాయం గురించి ఏమీ తెలియదు. రేవంత్ రెడ్డి ఏనాడైనా వ్యవసాయం చేశారా? పొలం దున్నారా? అందుకే ఇలా నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. కొడంగల్‌లో రేవంత్ రెడ్డి పెద్ద భూకబ్జాదారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి తీసేస్తామంటున్నారు. రేవంత్ రెడ్డి కొడంగల్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎలాంటి పనులు చేయలేదు. రేవంత్ నోరు తెరిస్తే గబ్బు. ఆయన టికెట్లు అమ్ముకున్నారని కాంగ్రెస్ నేతలే అంటున్నారు. తెలంగాణ ఉద్యమకారులపైకి రేవంత్ తుపాకీ పట్టుకొని వెళ్లారు. నీతి నియమం లేని వ్యక్తి రేవంత్ రెడ్డి. రూ.50 లక్షలతో ఎమ్మెల్యేలను కొంటూ పట్టుబడిన ఆయన తీరును మీరంతా టీవీల్లో చూశారు. దీని గురించి ఎవరైనా అడిగితే.. అలా దొరకడం ఆయనకు మెడల్ రావడంతో సమానం అని అంటున్నారు. ఇవన్నీ చేసిన రేవంత్ రెడ్డి మళ్లీ సత్యహరిశ్చంద్రుడిలా మాట్లాడటం విడ్డూరంగా ఉంది. కొడంగల్‌లో సరిపోలేదని.. కామారెడ్డిలో నాపై పోటీకి వచ్చారు. రేవంత్ రెడ్డిని కొడంగల్‌లో చిత్తుగా ఓడించాలి. నేనే సీఎం అనేవాళ్లు కాంగ్రెస్‌లో 15 మంది ఉన్నారు. కాంగ్రెస్ గెలిస్తే కదా.. రేవంత్ సీఎం అయ్యేది. రేవంత్ సీఎం అవుతాడని ఓట్లేస్తే కొడంగల్ పరిస్థితి మళ్లీ మొదటికే. ప్రజలు ఇవన్నీ గమనించాలి. కొడంగల్‌లో పనిచేసే నరేందర్ రెడ్డి కావాలా? వట్టిమాటలు చెప్పే రేవంత్ రెడ్డి కావాలా? ప్రజలే తేల్చుకోవాలి. ఎమ్మెల్యేగా ఎవరుంటే కొడంగల్ గౌరవం పెరుగుతుందో ప్రజలే నిర్ణయం తీసుకోవాలి" అని కేసీఆర్ కోరారు.

**కాంగ్రెస్ రాజ్యంలో ఆకలి చావులు.. ఆత్మహత్యలు..** మహబూబ్‌నగర్: కాంగ్రెస్ పార్టీ తెలంగాణను 58ఏళ్లు గోస పెట్టిందని భారాస అధినేత, సీఎం కేసీఆర్ విమర్శించారు. మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన భారాస ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. "పాలమూరు జిల్లాలను బొంబాయి బస్సులకు ఆలవాలం చేశారు. సాగునీరు, తాగునీరు, కరెంటు ఇయ్యలేదు. చేనేత కార్మికుల ఆకలి చావులు, రైతుల ఆత్మహత్యలు, వలసలు.. ఇదీ కాంగ్రెస్ రాజ్యంలో మన బతుకు. 1969లో తెలంగాణ ఉద్యమం వస్తే 400 మందిని పిట్టల్ని కాల్చినట్టు కాల్చి చంపారు. ఉద్యమంలో భాగంగా నేను మహబూబ్‌నగర్ నుంచి పోటీ చేస్తే గెలిపించారు. మహబూబ్‌నగర్ ఎంపీగా ఉన్నప్పుడే తెలంగాణ సాధించాం. పాలమూరు ప్రజలు వివేకవంతులు. ఓటు వేసే ముందు అభ్యర్థులతో పాటు వారి పార్టీ చరిత్రను కూడా చూడాలి. తెలంగాణ రాగానే ఒక్కో సమస్యను పరిష్కరించుకుంటూ వచ్చాం. ఆదాయం పెరిగిన కొద్దీ సంక్షేమ పథకాలు పెంచుకుంటూ పోతున్నాం. మహబూబ్‌నగర్ పట్టణం గతంలో ఎలా ఉండేది... ఇప్పుడు ఎలా ఉంది. బైపాస్‌రోడ్డు వేయించారు. ఎకో పార్క్ ఏర్పాటు చేశారు. దివిటిపల్లి వద్ద రూ.10వేల కోట్లతో అమరరాజా బ్యాటరీ పరిశ్రమ ఏర్పాటు కాబోతోంది. ఐటీ టవర్ ఏర్పాటు చేశారు. మంచి వాళ్లు గెలిస్తే మంచి జరుగుతుంది.. చెడ్డ వాళ్లు గెలిస్తే మళ్లీ మొదటికే పోతుంది" అని సీఎం కేసీఆర్ అన్నారు.



## ఎన్నికల ఫలితాలు రాగానే జాబ్ క్యాలెండర్‌పై దృష్టి సారిస్తాం : కేటీఆర్

యాదాద్రి : ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత జాబ్ క్యాలెండర్‌పై దృష్టి పెడుతామని మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ప్రకటించారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మునుగోడు దుస్థితికి కారణమైన కాంగ్రెస్‌పై మండిపడ్డారు. 60 ఏళ్ల పాటు మునుగోడు ప్రజలను ఇబ్బందులకు గురి చేసింది ఎవరి ప్రశ్నించారు. గతంలో ఆ పార్టీకి 11 ఛాన్స్‌లు ఇచ్చినా ఏం చేశారంటూ మండిపడ్డారు. టీపీసీసీ అధ్యక్షుడు మూడు గంటలు పొలాలకు కరెంట్ చాలని చెబుతున్నాడని.. మరి మూడు గంటలు కరెంట్ సరిపోతుందో.. లేదో చెప్పాల్సింది ప్రజలేనన్నారు. కరెంటు కావాలో.. కాంగ్రెస్ కావాలో తేల్చుకోవాలన్నారు. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే పింఛన్‌ను రూ.5వేలకు పెంచుతామన్నారు. సౌభాగ్యలక్ష్మి పథకం కింద 18ఏళ్లు నిండిన మహిళలకు రూ.3వేలు అందించనున్నట్లు తెలిపారు. అలాగే అసైన్డ్ భూముల ఉన్న వారికి యాజమాన్య హక్కులు కల్పించనున్నట్లు చెప్పారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బీజేపీ సిద్ధాంతాలను కాంగ్రెస్‌లో అమలు చేస్తున్నారన్నారు. ప్రధాని నరేంద్ర మోదీని ఒక్కసారి సైతం విమర్శించలేదన్నారు.

కాంగ్రెస్ హవా అనేది సామాజిక మాధ్యమాల్లో ప్రచారం మాత్రమేనంటూ సెటైర్లు వేశారు. బీఆర్ఎస్ 80 సీట్లలో విజయం సాధించి అధికారంలోకి వస్తుందని స్పష్టం చేశారు. తొమ్మిదేళ్ల పాలనలో మైనారిటీలకు సీఎం కేసీఆర్ ప్రభుత్వం చాలా చేసిందని, వారి మద్దతు తమకే కుంటుందని పేర్కొన్నారు. రైతుబంధు రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు అనుమతి ఇవ్వాలని ఈసీని రెండుసార్లు కోరామని కేసీఆర్ పేర్కొన్నారు. పీఎం కిసాన్ సమ్మాన్‌కు లేని అడ్డంకి రైతుబంధుకు ఎందుకు అంటూ ప్రశ్నించారు.

## బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రైతుల పాలిట శత్రువులు: మంత్రి హరీశ్‌రావు



సిద్దిపేట: బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రైతుల పాలిట శత్రువులని మంత్రి హరీశ్‌రావు అన్నారు. రైతులకు మంచి జరగాలనే ఉద్దేశంతో వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ యూపీఏ హయాంలో కేంద్రానికి ఒక నివేదిక సమర్పించారని, కాంగ్రెస్ గానీ, బీజేపీ గానీ ఆ నివేదికను ఇప్పటికే అమలు చేయలేదని ఆయన విమర్శించారు. సిద్దిపేటలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మంత్రి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు మోటార్లకు మీటర్లు పెట్టాలని తెలంగాణ ప్రభుత్వంపై ఒత్తిడి చేసిందని, మీటర్లు పెట్టకపోతే రాష్ట్రానికి రావాల్సిన నిధులకు కోత పెడుతామని బెదిరించిందని, అయినా గూడా మోటార్లకు మీటర్లు పెట్టేది లేదని సీఎం కేసీఆర్ తెగేసి చెప్పారని మంత్రి వివరించారు. దేశంలో మోటార్లకు మీటర్లు పెట్టని ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని చెప్పారు. మోటార్లకు మీటర్లు పెట్టనందుకు గత ఐదేళ్లలో రాష్ట్రానికి రావాల్సిన నిధుల్లో రూ.25 వేల కోట్ల నష్టం చేసిన బీజేపీకి ఓట్లడిగే అర్హతే లేదని అన్నారు. మోటార్లకు మీటర్లు పెట్టమని బీజేపీ సర్కారు ఒత్తిడి చేసిందని మేము చెబుతుంటే.. లేదు లేదు తమ ప్రభుత్వం ఆ మాటే అనలేదని తెలంగాణ బీజేపీ నేతలు అదరగొట్టింద్రని చెప్పారు. మంగళవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన వ్యాఖ్యలతో నిజమేదో అబద్ధమేదో తేలిపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు కూడా మోటార్లకు మీటర్లు పెడుతున్నయని చెప్పి నిర్మలా సీతారామన్ పుణ్యం కట్టుకున్నారని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ రైతుల పక్షపాతి అని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాల్లో కూడా మోటార్లకు మీటర్లు పెట్టారని, ఒకవేళ కాంగ్రెస్ గెలిచినా రాష్ట్రంలో రైతుల మోటార్లకు మీటర్లు పెడుతారని అన్నారు. పొరపాటున కూడా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఓటు వేయవద్దని చెప్పారు. మోటార్లకు మీటర్ల విషయమై కేంద్రం నుంచి వచ్చే రూ.25 వేల కోట్ల నిధులు ముఖ్యమా.. రాష్ట్రంలోని 69 లక్షల మంది రైతుల ప్రయోజనాలు ముఖ్యమా..? అనే ప్రశ్న తలెత్తినప్పుడు సీఎం కేసీఆర్ రైతుల పక్షాననే నిలిచారని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. మోటార్లకు మీటర్లు పెట్టి రైతులకు 24 గంటల ఉచిత కరెంటు లేకుండా చేయాలనేది బీజేపీ, కాంగ్రెస్ పార్టీల కుట్ర అని మంత్రి విమర్శించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఓటేస్తే 24 ఉచిత కరెంటు ఎత్తేస్తరని తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ దొందూ దొందేనని మంత్రి ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతున్నదని చెప్పారు. కేసీఆర్ సీఎం అయిన నాడు తెలంగాణ తలసరి ఆదాయం రూ.1,24,104 ఉంటే, ఇప్పుడు తెలంగాణ తలసరి ఆదాయం రూ.3,17,117కు చేరింది. బీజేపీ ప్రభుత్వం 100 నెలల్లో 100 లక్షల కోట్ల అప్పుచేసిందని మండిపడ్డారు. నెలకు రూ. లక్ష కోట్ల చొప్పున కేంద్రం అప్పులు తెచ్చిందన్నారు. అయినా బీజేపీ గురివింద రీతిన మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.




నిజామాబాద్: ఎంపీగా కవితను ఓడించారని నిజామాబాద్ జిల్లా ప్రజలపై సీఎం కేసీఆర్ పగబట్టారని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆరోపించారు. నిజామాబాద్ జిల్లాకు పసుపు బోర్డు తెస్తామని చెప్పి గెలిచిన ఎంపీ జాడ లేకుండా పోయారని విమర్శించారు. నిజామాబాద్‌లో నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరి యాత్రలో రేవంత్ మాట్లాడారు. వంద రోజుల్లో షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని సీఎం కేసీఆర్ చెప్పి పదేళ్లు గడిచిందని.. ఇచ్చిన హామీ ప్రకారం ఇప్పటివరకూ చక్కెర పరిశ్రమను ఎందుకు తెరిపించలేదు?అని ప్రశ్నించారు. "భారాస పాలనలో మద్దతు ధర అడిగిన ఎర్రజొన్న రైతులపై పోలీసు కేసులు పెట్టారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఆర్టీసీ కార్మికులను వేధించారు. కేసీఆర్ కుటుంబం లక్షల కోట్ల రూపాయల ప్రజాధనం లూటీ చేసింది.

రైతుల భూములు మింగేందుకు ప్రయత్నించారు. త్వరలోనే తన పదవి పోతుందని కేసీఆర్‌కు అర్థమైంది. 80కి పైగా సీట్లలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది. 80 సీట్లకు తక్కువ వస్తే కేసీఆర్ వేసే శిక్షకు నేను సిద్ధం" అని రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు.

## కేసీఆర్, మోదీ, ఓవైసీ ముగ్గురు తోడు దొంగలే

ఆలంపూర్: సీఎం కేసీఆర్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ ముగ్గురు తోడు దొంగలేనని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. బుధవారం నాడు ఆలంపూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ..." తెలంగాణ ప్రజలు ఇచ్చే విజయ కానుకను భారతదేశం మొత్తం ప్రతిబింబిస్తుంది. ఆలంపూర్ చాలా పవిత్రమైన ప్రాంతం.. కృష్ణ మరియు తుంగభద్రాల సంగమ ప్రాంతం. దేశంలో ఉన్న మూడు పత్రికల సుమారు 780 కోట్ల ఆస్తులను బీజేపీ ప్రభుత్వం జప్తు చేసింది. ఈ మూడు పత్రికలు నెహ్రూ సొంత ఆస్తి. నెహ్రూ స్థాపించిన ఈ మూడు పత్రికలు స్వతంత్ర పోరాటానికి ముఖ్య భూమికను పోషించాయి" అని మల్లికార్జున ఖర్గే తెలిపారు.



**పేదలను ఆదుకోవడంలో బీజేపీ, బీఆర్ఎస్ నిర్లక్ష్యం చేస్తున్నాయి :** "నిరుపేదలను ఆదుకోవడంలో బీజేపీ, బీఆర్ఎస్ నిర్లక్ష్యం చేస్తున్నాయి. ఇందిరాగాంధీ నీ విమర్శిస్తున్నావు ఇందిరాగాంధీ ఎక్కడ.. మరి కేసీఆర్ ఎక్కడ.. ఫామ్ హౌస్‌లో కూర్చొని పరిపాలిస్తున్నావు. 2017లో ఇచ్చిన నీ హామీలు ఏమయ్యాయి.. ఏ ఒక్కటి పూర్తి చేయలేదు. తెలంగాణ కోసం అప్పట్లో ఎంపీగా ఉన్న విజయశాంతి ఢిల్లీలో పార్లమెంట్‌లో సభ జరిగినప్పుడు తెలంగాణ కోసం స్పీకర్ పోడియంలోకి వెళ్లి 4, 5 గంటలు పోట్లాడింది.. ఆ సమయంలో నువ్వు ఎక్కడున్నావ్ కేసీఆర్.. కేసీఆర్,కొడుకు, కూతురు, అల్లుడు తెలంగాణను దోచుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తాం" అని మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు.

## ఎస్సైకు వార్నింగ్.. అక్బరుద్దీన్ ఓవైసీపై కేసు నమోదు

హైదరాబాద్: ఎంఐఎం నేత, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ పై కేసు నమోదు అయ్యింది. ఎన్నికల ప్రచారంలో డ్యూటీలో ఉన్న పోలీసు అధికారిని దూషించారనే అభియోగాలను అక్బరుద్దీన్‌పై బుధవారం కేసు నమోదు చేశారు సంతోష్ నగర్ పోలీసులు. ఈ మేరకు ఓ వీడియో వైరల్ కావడం కూడా తెలిసిందే. లలితాబాగ్‌లో మంగళవారం రాత్రి ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో.. సమయం అయిపోతుందని, ప్రచారం ముగించాలని స్థానికంగా విధులు నిర్వస్తున్న ఎస్సై శివచంద్ర అక్బరుద్దీన్‌ను కోరారు. ఆ సమయంలో పోలీసు అధికారిపై అక్బరుద్దీన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకా సమయం ఉందని, తాను మాట్లాడి తీరతానని, తనను ఆపేవాళ్లింకా పుట్టలేదని, తనను ఆపే దమ్ము ఎవరికీ లేదని, తన ఒంట్లో బుల్లెట్లు దిగినా.. కత్తిగాయాలు అయినా ధైర్యం ఇంకా మిగిలే ఉందని, ఒక్క సైగ చేస్తే ఇక్కడ ఉన్న అందరూ నిన్ను పరిగెత్తిస్తారంటూ ఎస్సైను ఉద్దేశించి అక్బరుద్దీన్ వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలకు సంబంధించిన



వీడియో సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో పాటు రాజకీయంగానూ విమర్శలకు తావిచ్చింది. మరోవైపు ఈ ఘటనపై ఐపీసీ సెక్షన్ 353 (విధుల్ని అడ్డుకోవడం)తో పాటు మరికొన్ని సెక్షన్ల కింద అక్బరుద్దీన్ ఒవైసీపై కేసు నమోదు చేసినట్లు డీసీపీ రోహిత్ రాజు వెల్లడించారు.

## మంథనిలో సర్పంచిపై దాడి.. ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు ఆగ్రహం



మంథని: పెద్దపల్లి జిల్లా మంథనిలో కాంగ్రెస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మహాముత్తారం మండలం ఓడేడు గ్రామ సర్పంచి బక్కారావుపై అధికార పార్టీకి చెందిన నాయకులు దాడులు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి తన నివాసం నుంచి ఎమ్మెల్యే శ్రీధర్ బాబు ర్యాలీగా వెళ్లారు. అయితే, ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకోగా, వారిని పోలీసులు గేటు ముందే అడ్డుకోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మంథనిలో రౌడీయిజం సంస్కృతిని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. భారాస అభ్యర్థి పుట్ట మధు గురించి మాట్లాడితే హత్యకు గురైన వామన్‌రావు దంపతులకు పట్టిన గతే పడుతుందని భారాస నేతలు సోషల్ మీడియాలో వార్నింగ్ ఇస్తున్నా.. పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. మంథనిలో శాంతియుత ఎన్నికల నిర్వహించాలని ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఇతర పార్టీల అభ్యర్థులు పోటీ చేయడానికి భయపడే విధంగా ప్రవర్తిస్తున్నారని శ్రీధర్‌బాబు ఆరోపించారు. బక్కన్న అనే వ్యక్తి ప్రజాస్వామ్య విధానాలపై నమ్మకంతో జనజీవన స్రవంతిలో కలిసి గ్రామ సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని చెప్పారు. ఆయనపై జరిగిన దాడి ఘటనకు సంబంధించి స్థానిక ఆర్డీవోకు ఫిర్యాదు చేసినట్లు శ్రీధర్‌బాబు వివరించారు.

## తెలంగాణలో బీసీ ముఖ్యమంత్రిని చూడాలనే భాజపాతో కలిశా: పవన్

హనుమకొండ: తెలంగాణ తనకు ఎంతో బాలాన్ని ఇచ్చిందని, అదే స్ఫూర్తితో ఏపీలో రౌడీలతో పోరాడుతున్నాని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. భాజపా అభ్యర్థులకు మద్దతుగా హనుమకొండలో నిర్వహించిన విజయసంకల్ప సభలో పవన్ పాల్గొని ప్రసంగించారు. "నా పోరాటానికి తెలంగాణ యువత అండగా ఉంటోంది. ఆంధ్రాలో ఎలా తిరుగుతున్నానో తెలంగాణలో కూడా అలాగే తిరుగుతా. ఏ మార్పు కోసం తెలంగాణ బిడ్డలు చనిపోయారో అది సాధిస్తా. తెలంగాణ ఇచ్చిన స్ఫూర్తితోనే పదేళ్లుగా పార్టీ నడుపుతున్నా. బలిదానాలపై ఏర్పడిన రాష్ట్రం అవినీతిమయం కావడం బాధ కలిగించింది. తెలంగాణలో దళిత ముఖ్యమంత్రిని చూడలేకపోయాం. బీసీ ముఖ్యమంత్రినైనా చూడాలని భాజపాతో కలిశాను. నాకు ఆంధ్రా



జన్మనిస్తే.. తెలంగాణ పునర్జన్మ ఇచ్చింది. నాడు తెలంగాణకు మద్దతు ఇచ్చిన వారిలో నేనూ ఒకడిని. వచ్చే ఏడాది నుంచి తెలంగాణలోనూ పర్యటిస్తా. కమలం గుర్తుకు ఓటు వేసి.. రావు పద్మ, ఎర్రబెల్లి ప్రదీప్‌ను గెలిపించాలి" అని ఓటర్లకు పవన్ కల్యాణ్ విజ్ఞప్తి చేశారు.

## ఎమ్మెల్యే షకీల్‌పై కాంగ్రెస్ దాడిని ఖండించిన కవిత




నిజామాబాద్: బోధన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్యే షకీల్, బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల దాడిని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడుతూ..."ఓటమికి భయపడే బీఆర్ఎస్ శ్రేణులపై కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు దాడులు చేస్తున్నారు. బీఆర్ఎస్ నేతలపై దాడి చేసిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలి. 60 లక్షల గులాబీ సైన్యం ముందు మీరెంత. సత్తా కలిగిన బీఆర్ఎస్ కార్యకర్తలు దాడులను ప్రజాక్షేత్రంలో దీటుగా ఎదుర్కొంటారు. ఇలాంటి దాడులకు తెగబడితే కాంగ్రెస్ పార్టీకి ప్రజలే తగిన బుద్ధి చెబుతారు" అని కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా.. ఎడపల్లి మండలం సాటాపూర్ గేట్‌లో కాంగ్రెస్ నాయకులపై పోలీసులు స్వల్ప లాఠీచార్జ్ చేశారు. దీంతో ఎమ్మెల్యే షకీల్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ కార్యకర్తలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య ఘర్షణ నెలకొంది. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అయితే పోలీసులు మాత్రం కాంగ్రెస్ నేతలను అదుపులోకి తీసుకోవడంతో వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## బంగారు తెలంగాణ కాంగ్రెస్‌తోనే సాధ్యం




హైదరాబాద్: బంగారు తెలంగాణ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని.. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సినీ నటి దివ్యవాణి కోరారు. బుధవారం గాంధీభవన్‌లో దివ్యవాణి మీడియాతో మాట్లాడారు. "విజన్ కలిగిన టీడీపీ పార్టీ అధినేత చంద్రబాబు దగ్గర గతంలో పని చేయడం ఆనందంగా ఉంది. కొన్ని కారణాల వల్ల టీడీపీ నుంచి బయటికి వచ్చాను. నీతి, నిజాయతీగా ప్రజలకోసం పనిచేస్తున్న కాంగ్రెస్‌లో పనిచేయాలని ఈ పార్టీలో చేరాను. విజయశాంతి కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రతి పేద వాడు బాగుపడాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యం. బంగారు తెలంగాణ కావాలంటే నియంత పాలకులను ఓడించి కాంగ్రెస్‌ను గెలిపించాలి. అహంకార ప్రభుత్వంలో బానిస బతుకుల నుంచి బయట పడేందుకు కాంగ్రెస్ రావాలి. ప్రజల భవిష్యత్తును కాపాడడం, దేశాన్ని కాపాడేది కాంగ్రెస్ మాత్రమే. కార్యకర్తగా తనకు ఏ పని అప్పగించినా బాధ్యతగా పనిచేస్తా. కాంగ్రెస్ మేనిఫెస్టోలో నచ్చిన అంశం ప్రగతి భవన్ కాదిది ప్రజాభవన్ అని ప్రకటించడం చాలా బాగుంది" అని దివ్యవాణి పేర్కొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com